Sweken IT Solutions
WE ARE HIRING !!
➢ NET Developers
➢ Data Entry
INTERESTED CANDIDATES
PLEASE SEND YOUR RESUME TO
MAIL: careers@sweken.com
PH: 9100986585

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారం

Bhavya Sai
PHOTO & VIDEO FILMING
Event Photo & Videography
Best Price
Photos & Videos Delivered
with in 24 Hrs...
Press Events PRO in Vizag
CELL 9948511438

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 158 విశాఖపట్నం, 3 ఏప్రిల్ 2025 గురువారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00



## తిరుమలపై సీఎం ఫోకస్

### టీటీడీ అధికారులతో సమీక్ష..

### కీలక సూచనలు

అమరావతి, విశాఖ సమాచారం : తిరుమలలో చేపట్టిన, చేపట్టవలసిన అభివృద్ధి పనులు, భక్తులకు అందుతున్న సేవలపై సీఎం చంద్రబాబు బుధవారం సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భక్తుల సౌకర్యాలు మెరుగుపరిచేందుకు గత 9 నెలల్లో తీసుకున్న చర్యలపై టీటీడీ అధికారులు సీఎం ఎదుట ప్రజంటేషన్ ఇచ్చారు. భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా భవిష్యత్‌లో చేపట్టాల్సిన చర్యలపై సీఎం దిశానిర్దేశం చేశారు. దర్శనాలు, వసతితో పాటు వివిధ సేవలపై భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయాలపైనా చర్చించారు. బ్రహ్మోత్సవాలు, రథసప్తమి, వైకుంఠ ఏకాదశి వంటి ప్రత్యేక సమయాలతో పాటు సాధారణ రోజుల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సీఎం సమీక్షించారు. శ్రీవారి లడ్డు, అన్నప్రసాదంలో తీసుకొచ్చిన మార్పులపై అధికారులు నివేదిక అందించారు. రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రత కారణంగా తిరుమలలో ⏭ తరువాయి 2లో..

### సవరణ బిల్లు లేకపోతే..

## పార్లమెంట్ భూమినీ వక్ఫ్ ఆస్తి అంటారు





- విపక్షాలపై కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు విమర్శ
- లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లు

ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లును తీసుకు వచ్చింది. కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బిల్లు ప్రవేశపెట్టిన అనంతరం సభలో ప్రసంగించారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని అన్నారు. "బిల్లు గురించి విపక్షాలు అసత్య ప్రచారం చేశాయి. అందులోని అంశాలను లేవనెత్తి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. 1954లో తొలిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. అది అప్రజా స్వామికం అని ఆనాడు ఎవరూ చెప్పలేదు. పార్లమెంట్ ఉభయ సభ్యులతో కూడిన జేపీసీకి అభి నందనలు.

మొత్తం 284 ప్రతినిధులు, 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వక్ఫ్ బోర్డులు జేపీసీలో తమ వాదనలు వినిపించాయి. మేం బిల్లులో కొన్ని సానుకూల మార్పులు చేస్తే.. మమ్మల్ని ఎందుకు ప్రశ్నిస్తున్నారు. ఈ బిల్లు తీసుకురాకపోతే.. కొందరు పార్లమెంట్ భవనాన్ని కూడా వక్ఫ్ ఆస్తిగా పేర్కొంటారు" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ స్పందనకు గతంలో మిగతా 2లో

### రాబోయే రోజులు

## మనవే..

### స్థానిక సంస్థల వైసీపీ ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్



తాడేపల్లి, విశాఖ సమాచారం : వైఎస్సార్‌సీపీ పాలనలో పేదల నోట్లోకి నాలుగు ముద్దలు వెళ్లేవని.. కానీ కూటమి ప్రభుత్వం వాళ్ల ముందు నుంచి ఉన్న కంచం లాగిపడేసిందని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. " స్థానిక సంస్థల వైసీపీ ప్రజాప్రతినిధులతో బుధవారం తాడేపల్లిలోని కేంద్ర



కార్యాలయంలో ఆయన భేటీ అయ్యారు. కూటమి అరాచకాలకు ఎదురొడ్డి నిలిచిన వాళ్ల తెగువను అభినందించారు. రాబోయే రోజులు మనవే. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అఖండ మెజార్టీతో గెలుస్తుంది. ఈసారి కార్యకర్తలకోసం కచ్చితంగా పార్టీ నిలబడుతుంది. కోవిడ్ కారణంగా నేను కార్యకర్తలకు చేయాల్సినంత చేయలేక పోవచ్చు. జగన్ 2.0 దీనికి భిన్నంగా ఉంటుంది. ⏭ తరువాయి 2లో..

### బయో ఫ్యూయల్ ఉత్పత్తిలో

## అగ్రగామిగా ఏపీ



### మంత్రి నారా లోకేశ్

### ప్రకాశం జిల్లాలో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్‌కు శంకుస్థాపన

ఒంగోలు, విశాఖ సమాచారం : 'యువగళం' పాదయాత్ర సమయంలో ప్రజల కష్టాలను నేరుగా చూశానని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రకాశం జిల్లా పీసీ పల్లి మండలం దివాకరపల్లి సమీపంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ (సీబీజీ)కు బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా అంటే గుర్తొచ్చేది ప్రేమ, పౌరుషం. ఈ జిల్లాకు సీఎం చంద్రబాబు, టీడీపీ అంటే చాలా గౌరవముంది. 2019లో ఎదురుగాలి ఉన్నా ఇక్కడి నుంచి నలుగురు టీడీపీ ఎమ్మెల్యేలను గెలిపించారు. 2024 ఎన్నికల్లో 10 సీట్లలో విజయం అందించారు. ఈ జిల్లాలో యువగళం పాదయాత్ర ప్రభంజనంలా సాగిందని గుర్తుచేసుకున్నారు. "ఉమ్మడి ప్రకాశం జిల్లాకు గత ప్రభుత్వం ఏమీ చేయకపోగా వాటాలు ఇవ్వలేదని ఉన్న సంస్థలను తరిమేసింది. వైసీపీ హయాంలో తీసుకొచ్చిన ఒక్క కంపెనీ పేరైనా చెప్పాలని ⏭ తరువాయి 2లో..





## ఎమ్మెల్సీగా నాగబాబు ప్రమాణ స్వీకారం

- త్వరలో మంత్రివర్గంలో చోటు

అమరావతి, విశాఖ సమాచారం : జనసేన పార్టీ సీనియర్ నాయకుడు, మెగా బ్రదర్ కొణిదెల నాగబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యుడిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే విభాగంలో శాసన మండలికి నాగబాబు ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. శాసనమండలి చైర్మన్ కార్యాలయంలో చైర్మన్ మోషేన్ రాజు నాగబాబు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. మరో నలుగురు ⏭ తరువాయి 2లో..

### ఐటీ కోసం తర్లువాడలో

## 200 ఎకరాలు

### మాదాపూర్, గచ్చిబౌలి స్థాయిలో ఆనందపురం అభివృద్ధి

### ఆర్నెల్లలో రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు

### ఎమ్మెల్యే గంటా

ఆనందపురం, విశాఖ సమాచారం : మండలంలోని గంగసాని అగ్రహారంలో వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేస్తున్న లే అవుట్‌లో ప్లాట్లను 6 నెలల్లో రైతులకు అందజేసి ఆదర్శంగా నిలవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. ఈ లే అవుట్ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన




చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 9 ఏళ్ల నుంచి పెండిరగ్ లో ఉన్న రైతుల సమస్యకు రెండు రోజుల్లో పరిష్కారం చూపించామని తెలిపారు. 2016 లో వీఎంఆర్‌డీఏ ⏭ తరువాయి 2లో..

## పట్టాలు తప్పిన నాగావళి ఎక్స్‌ప్రెస్



విజయనగరం, విశాఖ సమాచారం : నాగావళ్లి ఎక్స్‌ప్రెస్ (20810)కు పెను ప్రమాదం తప్పింది. విజయనగరం రైల్వే స్టేషన్ దాటిన తర్వాత పట్టాలు తప్పింది. హౌరా -రాయపూర్ లైన్ డివైడ్

## ప్రేమోన్మాది దాడి ..

- వివరాలు 2లో

### అడ్డుకున్న తల్లి మృతి, యువతి పరిస్థితి విషమం

### విశాఖ మధురవాడ సమీపంలో దారుణం



### సాంకేతిక సమస్య సృష్టించి.. రైళ్లు ఆపి దోపిడీ




పడుగుపాడు, విశాఖ సమాచారం: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో అల్లూరు రోడ్డు–పడుగుపాడు స్టేషన్ల మధ్య దొంగలు రైళ్లను ఆపి దోపిడీకి పాల్పడ్డారు. పట్టాలపై సిగ్నల్‌లో సాంకేతిక సమస్య సృష్టించి.. బెంగళూరు ఎక్స్‌ప్రెస్, చండీగఢ్ ఎక్స్‌ప్రెస్‌లను ఆపారు. అనంతరం బోగీల్లోకి ప్రవేశించి మహిళల మెడలలోని బంగారం, బ్యాగ్‌లు దోచుకెళ్లారు. దాదాపు 30 నిమిషాల పాటు రెండు రైళ్లలో దొంగల ముఠా బీభత్సం సృష్టించింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురై కేకలు వేశారు. బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌లోని ⏭ తరువాయి 2లో..

### విదేశీ విద్యార్థులపై అమెరికా ఏఐ నిఘా





అమెరికా : హమాస్ అనుకూల విద్యార్థులను పట్టుకోవడానికి ట్రంప్ యంత్రాంగం సాంకేతికతను వినియోగిస్తోంది. క్యాంపస్ ఆందోళనల్లో క్రియాశీలంగా వ్యవహరించిన అమెరికాలోని విదేశీ విద్యార్థులకు అక్కడి విదేశాంగశాఖ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. కేవలం ఆందోళనల్లో పాల్గొన్న వారినే కాకుండా అక్కడి దృశ్యాలను, జాతి వ్యతిరేక సందేశాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన వారిని స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోవాలంటూ ఈమెయిల్స్ పంపినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో ⏭ తరువాయి 2లో..

### ఐదు రోజుల తర్వాత సజీవంగా..



మయన్మార్: మయన్మార్‌లో ప్రకృతి విపత్తు సంభవించిన దాదాపు ఐదు రోజుల తర్వాత సహాయక సిబ్బంది ఓ వ్యక్తిని సజీవంగా శిథిలాల కింద నుంచి బయటకు తీశారు. భారీ భూకంపంతో మయన్మార్, థాయ్‌లాండ్లు వణికిపోతున్నాయి. ఈ ప్రకృతి విపత్తు కారణంగా మయన్మార్‌లో మృతుల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోంది. అదేవిధంగా శిథిలాల కింద చిక్కుకుపోయిన వేలాది మందిని రక్షించేందుకు సహాయక సిబ్బంది కృషి చేస్తున్నారు. ఈక్రమంలో శిథిలాల కింద చిక్కుకుపోయిన ఓ వ్యక్తిని సిబ్బంది రక్షించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ⏭ తరువాయి 2లో..

### రష్యాలో కోవిడ్ తరహా మిస్టరీ వైరస్?



మాస్కో: రష్యాలో అంతుచిక్కని వైరస్ విజృంభిస్తున్నట్లు పలు వార్తాసంస్థలు పేర్కొంటున్నాయి. అక్కడి ప్రజలు తీవ్రమైన శ్వాసకోస సంబంధిత వ్యాధులతో.. దీర్ఘకాలిక జ్వరంతో బాధపడుతున్నారని తెలిపాయి. వైరస్ కారణంగా వారు దగ్గుతున్నప్పుడు రక్తం పడుతోందనే నివేదికలు ప్రపంచ దేశాల్లో ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. రష్యాలో మిస్టరీ వైరస్ విజృంభిస్తోందని మార్చి 29న పలు నివేదికలు వెలువడ్డాయి. పలు నగరాల్లో ప్రజలు వారాలతరబడి జ్వరం, ఒళ్లు నొప్పులు, తీవ్ర దగ్గుతో బాధపడుతున్నారని.. ఈ వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోందని అవి పేర్కొన్నాయి. ⏭ తరువాయి 2లో..

## సాంకేతిక సమస్య సృష్టించి.. రైళ్లు ఆపి దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

ఎస్-4, ఎస్-5 బోగీల్లో మహిళల మెడలోని బంగారు నగలను దుండగులు దోచుకెళ్లారు. పడుగుపాడు స్టేషన్ వద్ద మరికొందరిపై దాడి చేసి బంగారం లాక్కుపోయారు. చండీగఢ్ ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్-2, ఎస్-3, ఎస్-5 కోచ్‌లలో నగలను దోచుకోవడంతో పాటు బ్యాగ్‌లను ఎత్తుకెళ్లారు. నెల్లూరుకు చెందిన ఆర్‌పీఎఫ్, జీఆర్పీ బృందాల నిర్లక్ష్యంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అల్లూరు స్టేషన్ రోడ్డులోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ విచారణ జరుపుతున్నారు. మరోవైపు స్థానిక పోలీసులు కూడా ఈ ఘటనపై ఆరా తీస్తున్నారు.

## రష్యాలో కోవిడ్ తరహా మిస్టరీ వైరస్?

(మొదటి పేజీ తరువాయి)

అయితే కొవిడ్ టెస్టులు చేసినప్పుడు నెగిటివ్ వచ్చిందని.. ఇది మరో కొత్త వైరస్ అయి ఉంటుందని అభిప్రాయం వ్యక్తంచేశాయి. రష్యాకు చెందిన అలెగ్జాండ్రా అనే మహిళ ఐదు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుందని.. కొన్ని రోజులకు దగ్గుతున్న సమయంలో రక్తం పడుతున్నట్లు తెలిపిందని నివేదికలు వెల్లడిరచాయి. ఎన్ని మందులు వాడినప్పటికీ తగ్గుదల కనిపించట్లేదని ఆందోళన వ్యక్తంచేశాయి. ఇటువంటి అనేక ఇతర కేసుల గురించి వివరించాయి. మరికొందరు నెటిజన్లు తాము తీవ్రమైన రక్తంతో కూడిన దగ్గుతో బాధ పడుతున్నట్లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

**అవన్నీ తప్పుడు ప్రచారాలు..**

కాగా ఈ నివేదికలను రష్యన్ అధికారులు ఖండిరచారు. తాము జరుపుతున్న పరీక్షల్లో దేశంలో ఎలాంటి నూతన వ్యాధి కారకాలు బయటపడలేదని.. కొత్త వైరస్ వ్యాపించినట్లు ఎటువంటి ఆధారాలు లేవని వెల్లడిరచారు. రకరకాల వదంతులు, తప్పుడు ప్రచారాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నప్పటికీ అందులో నిజం లేదన్నారు. నివేదికల్లో పేర్కొన్న మహిళకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు మైకోప్లాస్మా న్యుమోనియా ఉన్నట్లు నిర్ధరించారని తెలిపారు. ఒకవేళ కొవిడ్ తరహా వైరస్ వస్తే దానిని ఎదుర్కోవడానికి తగిన సదుపాయాలు ఉన్నాయన్నారు.

## ఐదు రోజుల తర్వాత సజీవంగా..

(మొదటి పేజీ తరువాయి)

మయన్మార్, టర్కిష్‌కు చెందిన సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. ఈక్రమంలోనే రాజధాని నేపిడాలోని ఓ భవనం శిథిలాల కింద 26 ఏళ్ల వ్యక్తిని గుర్తించారు. వెంటనే అతడిని రక్షించి, ఆస్పత్రికి తరలించారు. ఇటీవల రెస్క్యూ సిబ్బంది మాండలేలోని గ్రేట్‌వాల్ హోటల్ శిథిలాల నుంచి ఒక గర్భిణీని సజీవంగా బయటకు తీసిన సంగతి తెలిసిందే. ఇక, ఈ భూకంపం కారణంగా మధ్య, వాయువ్య మయన్మార్‌లో మొత్తం 10 వేల భవనాలు కులిపోవడం లేదా పూర్తిగా దెబ్బతిన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. నిమిషాల వ్యవధిలో వచ్చిన భారీ భూకంపాలతో ఇటీవల మయన్మార్ కుదేలైంది. బలమైన ప్రకంపనల ధాటికి పలు నిర్మాణాలు, భవనాలు ఎక్కడికక్కడ పేకమేడల్లా కూలిపోయాయి. ప్రకృతి విపత్తు కారణంగా ఇక్కడ ఇప్పటివరకు 2,719 మంది మృతిచెందగా.. 4,521 మంది గాయపడ్డారు. ఇంకా 441 మంది ఆచూకీ తెలియరావాల్సి ఉంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. విపత్కర సమయంలో పొరుగుదేశానికి అండగా నిలిచేందుకు 'ఆపరేషన్ బ్రహ్మ' పేరిట భారత్ పెద్దఎత్తున సహాయక సామగ్రిని చేరవేస్తోంది. 80 మందితో కూడిన ఎన్డీఆర్ఎఫ్ బృందం సహాయక చర్యల్లో పాల్గొంటోంది. భారత్‌తో పాటు వివిధ దేశాలు కూడా మయన్మార్‌కు సాయాన్ని అందిస్తామని ప్రకటించాయి. ఇక, థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఇప్పటివరకు 13 మృతదేహాలు బయటపడ్డాయి. భూకంపం కారణంగా నిర్మాణంలో ఉన్న 30 అంతస్తుల భవనం కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో శిథిలాల కింద 300 మంది కార్మికులు చిక్కుకుని ఉంటారని, వారిలో ఎక్కువమంది విదేశాల నుంచి వచ్చినవారేనని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

## బయో ఫ్యూయల్ ఉత్పత్తిలో అగ్రగామిగా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేస్తున్నా. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు రూ.8లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. దానికి సంబంధించిన పనులు ప్రారంభించాం. దానిలో భాగంగానే బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నందుకు గర్వంగా ఉంది. ఈ ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు ఇవ్వాలన్నది ప్రభుత్వం ఆలోచన" అని లోకేశ్ అన్నారు. కాగా బయో ఫ్యూయల్ ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. ప్రాజెక్టు కోసం రిలయన్స్ సంస్థ రూ.65 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ నిధులతో మొత్తం 500 సీబీజీ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా సుమారు 2.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ ప్లాంట్ల ద్వారా వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి హరిత, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ప్రతి సీబీజీ ప్లాంట్ రోజుకు 22 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంటుంది. నిరుపయోగంగా ఉన్న దాదాపు 5 లక్షల ఎకరాల భూమిని ఎనర్జీ ప్లాంటేషన్ కోసం వినియోగించనున్నారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పట్టాలు తప్పిన నాగావళి ఎక్స్‌ప్రెస్

(మొదటి పేజీ తరువాయి)

అవుతుండగా రైలు చివరి బోగీలు పట్టాలు తప్పాయి. గార్డు వైపు వెనుకున్న రెండు బోగీలు పట్టాల నుంచి పక్కకు జరిగాయి. దీంతో దాదాపు 2 గంటలకు పైగానే రైలును నిలిపివేశారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. రైలు నాందేడ్ నుంచి సంబల్పూర్ వెళ్తున్న సమయంలో ఘటన జరిగింది. విషయం తెలుసుకున్న విజయనగరం రైల్వే సిబ్బంది.. స్పాట్‌కు వెళ్లి మరమ్మతులు చేశారు. పట్టాలు తప్పిన రెండు బోగీలను రైలు నుంచి పక్కకు తీశారు. అనంతరం యథావిధిగా ప్రయాణికులతో రైలు వెళ్లిపోయింది. ఈ ఘటనతో పలు రైళ్ల రాకపోకలు ఆలస్యమయ్యాయి.

# ప్రకృతి విపత్తులపై మాక్ డ్రిల్







**విశాఖపట్టణం, విశాఖ సమాచారం:** ప్రకృతి విపత్తులు, అనుకోని ప్రమాద ఘటనలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై అవగాహన కల్పిస్తూ... అప్రమత్తం చేస్తూ జిల్లా ప్రకృతి విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మహారాణిపేట పరిధిలోని స్థానిక జబర్ తోట వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. సునామీ, తుఫాన్లు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ఎలా వ్యవహరించాలో, ఎలా జాగ్రత్తపడాలో డీపీఎం కళావతి సమక్షంలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్టీఆర్ఎఫ్ సిబ్బంది అవగాహన ప్రజలకు కల్పించారు. ఎన్డీఆర్ఎఫ్., ఎస్టీఆర్ఎఫ్, అగ్నిమాపక, పోలీసు, జీవీఎంసీ, రెవెన్యూ, వైద్యారోగ్య, ఆర్ అండ్ బి, పరిశ్రమలు, సివిల్ సప్లైస్, పశుసంవర్ధక, ఈపీడీసీఎల్, గ్రామీణ నీటి సరఫరా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు.

# ప్రేమోన్మాది దాడి ..

### అడ్డుకున్న తల్లి మృతి, యువతి పరిస్థితి విషమం

### విశాఖ మధురవాడ సమీపంలో దారుణం

**మధురవాడ, విశాఖ సమాచారం:** మధురవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. కొమ్మాదిలోని స్వయంకృషి నగర్‌లో ఉంటున్న ఓ అమ్మాయి, ఆమె తల్లిపై ప్రేమోన్మాది దాడి చేశాడు. ఈ ఘటనలో తల్లి మృతి చెందగా.. కుమార్తెకు తీవ్రగాయాలయ్యాయి. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్థానికుల సమాచారం ప్రకారం..బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఓ యువకుడు బాధితురాలు దీపిక ఇంట్లోకి చొరబడి యువతి, ఆమె తల్లిపై కిరాతకంగా కత్తితో దాడి చేసి పారిపోయాడు. ఈ ఘటనలో తల్లి లక్ష్మి(43) అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్ర గాయాల్కెన దీపికను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీపిక డిగ్రీ చదువుకొని ఇంట్లోనే ఉంటోంది. తనను ప్రేమించడం లేదనే కోపంతో ఓ ప్రేమోన్మాది రెచ్చిపోయి ఆమె కుటుంబంపై విరుచుకు పడ్డాడు. మధురవాడలో నివాసం ఉంటున్న నవీన్ అనే యువకుడు ప్రేమ పేరుతో కొంతకాలంగా కొమ్మాది స్వయం కృషి నగర్లో నివాసం ఉంటున్న దీపిక అనే యువతి వెంట పడుతున్నాడు. దీనికి ఆ యువతి ససేమిరా అనడంతో ఆమెపై పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం దీపిక ఇంటికి వెళ్ళి కత్తితో తీవ్రంగా దాడి చేశాడు.

కూతురు హాహాకారాలు విన్న తల్లి లక్ష్మి అతన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. ఆమెపై కూడా విచక్షణా రహితంగా దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలపాల్కెన లక్ష్మి అక్కడిక్కడే మృతి చెందింది. ఈ కేకలు విని అక్కడికి చేరుకున్న స్థానికులను కత్తితో బెదిరించి నవీన్ అక్కడి నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, తీవ్రంగా గాయపడిన దీపికను ఆసుపత్రికి తరలించారు.

**నిందితుడి అరెస్టు**

కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా బృందాలుగా ఏర్పడిన పోలీసులు నవీన్ కోసం గాలింపు చేపట్టారు. నిందితుడిని శ్రీకాకుళం సమీపంలో అదుపులోకి తీసుకొని విశాఖ తరలిస్తున్నట్టు సీపీ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు.

**కఠిన చర్యలు తీసుకోవాలి: సీఎం ఆదేశం**

ప్రేమోన్మాది ఘాతుకంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

**స్పందించిన హోంమంత్రి అనిత**

ఈ ఘటనపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చీతో ఫోన్‌లో మాట్లాడి.. బాధితురాలు దీపిక ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. యువతికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆదేశించారు.

## శాంతి చర్చలకు సిద్ధం

### కేంద్రానికి మావోయిస్టుల లేఖ



**న్యూఢిల్లీ:** మావోయిస్ట్ రహిత భారత్ నినాదంతో ఆపరేషన్ కగార్‌ను దూకుడుగా ముందుకు తీసుకెళ్తోంది కేంద్ర హోం మంత్రిత్వ శాఖ. ఈ క్రమంలో గత 100 రోజుల్లో వివిధ ఎన్‌కౌంటర్‌లలో 120 మందికి పైగా మావోయిస్టులను భద్రతా బలగాలు మట్టుపెట్టాయి. అదే సమయంలో మరోపక్క భారీగా దళ సభ్యులు లొంగిపోతున్నారు. ఈ క్రమంలో కేంద్ర, పలు రాష్ట్ర ప్రభుత్వాల ముందు మావోయిస్టులు శాంతి చర్చల ప్రతిపాదన ఉంచారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు ప్రతిపాదిస్తే.. కాల్పుల విరమణకు సిద్ధమంటూ మావోయిస్ట్ కేంద్ర కమిటీ సంచలన ప్రకటన చేసింది. "ప్రజల కోసం ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాలి. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి. ఛత్తీస్‌గఢ్, ఒడిషా, జార?ండ్, మధ్యప్రదేశ్, తెలంగాణలో జరుపుతున్న హత్యాకాండను ఆపాలి." శాంతి చర్చల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూల వాతావరణం కల్పించాలి. అప్పుడు మేం వెంటనే కాల్పుల విరమణ పాటిస్తాం" అని మావోయిస్ట్ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో లేఖ విడుదలైంది. దీనికి కేంద్రం ఎలా స్పందిస్తుందో చూడాలి.

## సవరణ బిల్లు లేకపోతే పార్లమెంట్ భూమినీ వక్ఫ్ ఆస్తి అంటారు

(మొదటి పేజీ తరువాయి)

ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ చేసిన వ్యాఖ్యలు కారణం. దేశ రాజధానిలోని పార్లమెంట్ భవనం, దాని పరిసర ప్రాంతాలు వక్ఫ్ ఆస్తికి సంబంధించినవని అజ్మల్ అప్పట్లో వాదించారు.

"వక్ఫ్ బిల్లు ముస్లిం సమాజానికి చెందిన మత విశ్వాసాలకు ఎలాంటి ఆటంకం కలిగించదు. ఇది కేవలం ఆస్తుల నిర్వహణకు సంబంధించిన విషయం మాత్రమే. ఈ బిల్లుకు మద్దతు ఇచ్చేవారు, వ్యతిరేకించేవారు ఎప్పటికీ గుర్తుండిపోతారు. పేద ముస్లింలకు వక్ఫ్ ఆస్తులను ఉపయోగించాలి. వారిని అలా వదిలేయకూడదు. వారి ఉన్నతి కోసం మోదీ ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారు..? ముస్లిం ప్రతినిధులు ఆ బిల్లును ఆహ్వానించారు. వీల్కెనంత త్వరగా దీనికి ఆమోదం లభించాలని ఆ వర్గంలోని పేదలు కోరుకుంటున్నారు. అలాగే రిజిస్టర్ చేసిన ఆస్తి విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరు. ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో ముస్లిం మహిళలు, పిల్లలకు వారి హక్కులు దక్కుతాయి. ప్రభుత్వ భూమి విషయంలో వివాదం తలెత్తితే కలెక్టర్ కంటే పైస్థాయి వ్యక్తి తీర్పు ఇవ్వాలంటూ జేపీసీ చేసిన ప్రతిపాదనను మేం అంగీకరించాం" అని రిజిజు స్పష్టత ఇచ్చారు. మరోవైపు విపక్షాలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. ఈ బిల్లుకు వ్యతిరేకంగా కోల్‌కతాలో మార్చ్ జరిగింది. కాగా, ఈ బిల్లుకు టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు ప్రకటించాయి. బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తామని వైసీపీ ప్రకటించింది.

## తిరుమలపై సీఎం ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఎం పలు సూచనలు చేశారు. తిరుమలలో పెండిరగ్ అంశాలు, భక్తుల రద్దీ దృష్ట్యా భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. శ్రీవారి దర్శనాలు, వసతితో పాటు వివిధ సేవల పై భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయాలను టీటీడీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తిరుమలలో బ్రహ్మోత్స వాలు, రథసప్తమి, వైకుంఠ ఏకదాశి వంటి ప్రత్యేక కార్యక్రమాలతో పాటు సాధారణ రోజుల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల పై సీఎం మాట్లాడారు. గ్యాలరీల్లో సౌకర్యాల్లో పెంపు, మరింత మంది భక్తులకు కల్పించేలా.. మాడవీధుల్లో ఏర్పాట్లను అధికారులు వివరించారు. అలిపిరిలో ఉన్న భక్తుల కోసం బేస్ క్యాంప్ నిర్మాణం, పద్మావతి అమ్మవారి దేవాలయం అభివృద్ధికి ప్రణాళిక అమరావతిలో శ్రీవారి ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై



మాట్లాడారు. ఈ క్రమంలో వీటికి సంబంధించిన నమూనాలను పరిశీలించారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ శ్యామలరావు, జేఈవో వెంకన్న చౌదరి తదితర అధికారులు హాజరయ్యారు.

## ఎమ్మెల్సీగా నాగబాబు ప్రమాణ స్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులు కూడా బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, కావలి గ్రీష్మ, బీద రవిచంద్ర, బీటీ నాయుడు ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, నాగబాబుకు త్వరలోనే ఏపీ కేబినెట్ లో అవకాశం రాబోతుందని సమాచారం. ఆయనకు పర్యాటక శాఖ ఇస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది.

## ఐటీ కోసం తర్లువాడలో 200 ఎకరాలు

(మొదటి పేజీ తరువాయి)

సేకరించిన 245 ఎకరాల్లో మొదటి విడతగా రైతుల కోసం 85 ఎకరాల్లో అన్ని హంగులతో లే అవుట్ తయారవుతుందన్నారు. ఎన్నికల ప్రచారానికి రామవరం వచ్చినప్పుడు వీఎంఆర్‌డీఏ తీసుకున్న భూముల సమస్య, జాతీయ రహదారి నుంచి 80 అడుగుల రోడ్డు కావాలని అడిగారని, ఇక్కడి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ ఈ రెండు హామీలను తీర్చడం ఆనందంగా ఉందని తెలిపారు.

**15 వేల మంది యువతకు ఉపాధి**

10 వేల నుంచి 15 వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఐటీ పరిశ్రమను తర్లువాడ సమీపంలోని 200 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్నట్టు గంటా చెప్పారు. ఇప్పటికే భూ సేకరణ పనులు ప్రారంభమయ్యాయని ఆయన వెల్లడిరచారు. హైదరాబాద్ లోని మాదాపూర్, గచ్చిబౌలి మాదిరిగా విశాఖలో ఆనందపురం ప్రాంతం శరవేగంతో అభివృద్ధి చెందుతుందన్నారు. గత ఎన్నికల్లో 93 వేల మెజారిటీ ఇచ్చిన భీమిలి ప్రజల రుణాన్ని అభివృద్ధి చేసి తీర్చుకుంటానని పేర్కొన్నారు. 8 వేల జీతం కోసం ఈ ప్రాంత మహిళలు 25 నుంచి 30 కిలో మీటర్ల దూరంలోని పారిశ్రామిక ప్రాంతానికి వెళ్తున్నారని, పరిశ్రమలు ఇక్కడ అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత మహిళలకు మెరుగైన ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ భూములిచ్చిన రైతులకు నెల రోజుల్లో ఎల్‌పిఓసీలు ఇస్తామని, ఆ తర్వాత 20 రోజులకు ప్లాట్లు రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారామ్, బీజేపీ భీమిలి ఇంచార్జ్ రామానాయుడు, రామవరం సర్పంచ్ ఎర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే రోజులు మనవే..

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తలకోసం గట్టిగా నిలబడతాను" అని జగన్ అన్నారు.

"మిమ్మల్ని చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత ఉండాలని నమ్మే వ్యక్తిని. నేను అలాగే ఉంటాను, పార్టీకూడా అలాగే ఉండాలని ప్రతిక్షణం ఆశిస్తున్నాను. ఉప ఎన్నికల్లో మీరు చూసిన తెగువకు, ధైర్యానికి హాట్సాఫ్. మొత్తం 50 చోట్ల ఎన్నికలు జరిగితే, 39 స్థానాలు మన పార్టీ గెలిచింది. తెలుగుదేశం పార్టీకి సంఖ్యా బలం లేకున్నా దౌర్జన్యంగా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలనుకుంది. పోలీసులతో భయపెట్టి, బెదిరించారు" అని పేర్కొన్నారు.

చంద్రబాబు పాలనలో అబద్ధాలు, మోసాలే కనిపిస్తున్నాయి. మన పాలనలో ఏదో ఒక బటన్ నొక్కేవాళ్లం. ఏదోరూపంలో ప్రతి కుటుంబానికీ మంచి జరిగిందన్నారు.

తిరుపతి మున్సిపల్ ఉప ఎన్నికల్లో జరిగిన అక్రమాలను ప్రజలంతా చూశారు. విశాఖపట్నంలో కూడా అవిశ్వాస తీర్మానం పెట్టి, అక్కడ అక్రమాలు చేస్తున్నారు. మన కార్పొరేటర్లను కాపాడుకునే ప్రయత్నం మనవాళ్లు చేశారు. అక్కడ 40వ వార్డు కార్పొరేటర్ ఇంటికి వెళ్లి.. ఆయన భార్యను భయపెట్టే ప్రయత్నం పోలీసులు చేశారు. రామగిరిలో 10 ఎంపీటీసీల్లో 9కి వైయస్సార్‌సీపీవే. కాని అక్కడ ఎన్నిక జరగనీయకుండా అడ్డుకుంటున్నారు. భద్రత పేరుతో పోలీసులు తీసుకెళ్లి.. దారి మళ్లించి, స్వయంగా ఎస్సై ఎంపీటీసీలను కిడ్నాప్‌చేసే పరిస్థితి కనిపిస్తోంది. అప్పటికీ వినకపోతే, ఏకంగా మండల కార్యాలయంలో నిర్బంధించి బైండోవర్ చేశారు. అంతటితో ఆగకుండా లింగమయ్య అనే బీసీ నాయకుడ్ని చంపేశారు. ప్రతి నియోజకవర్గంలో చంద్రబాబు ఇలాంటి దారుణాలు చేయిస్తున్నారని ఆరోపించారు.

చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో 16కు 16 ఎంపీటీసీలు మనవాళ్లే. ఆరుగుర్ని ప్రలోభపెట్టి.. తీసుకెళ్లిపోయాడు. మరో 9 మంది వైఎస్సార్‌సీపీతోనే ఉన్నారు. వాళ్లను ఎన్నికల కేంద్రానికి వెళ్లనీయకుండా పోలీసులు, టీడీపీ వాళ్లు అడ్డుకున్నారు. కోరం లేకపోయినా.. గెలిచామని డిక్లేర్ చేయించుకున్నారు. రాష్ట్రానికి సీఎం, కుప్పంకు ఎమ్మెల్యే చంద్రబాబే.. అయినా సరే ఒక చిన్నపదవికోసం ఇన్ని దారుణాలు చేశారని మండిపడ్డారు.

## విదేశీ విద్యార్థులపై అమెరికా ఏఐ నిఘా

(మొదటి పేజీ తరువాయి)

ఓ కీలకమైన విషయం వెలుగులోకి వచ్చింది. హమాస్ అనుకూల ఉగ్రవాద గ్రూపులకు మద్దతిస్తున్న విదేశీ విద్యార్థులను గుర్తించడానికి.. వారిపై నిఘా పెట్టడానికి అమెరికా ప్రభుత్వం ఏఐ సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఉగ్రవాద అనుకూల పోస్టులు, స్టోరీలకు ఇన్‌స్టాలో లైక్ కొట్టినా దొరకబుచ్చుకునేలా ట్రంప్ యంత్రాంగం సాంకేతికతను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నాయి. యూఎస్ విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో నాయకత్వంలో అధికారులు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేసిన నాటినుంచి ఇప్పటివరకు వారికి మద్దతుగా ఎవరెవరు సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టులు చేశారు, ఎవరు వాటిని లైక్, షేర్ చేశారనే విషయాలు తెలుసుకోవడానికి విదేశీ విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలను స్కాన్ చేస్తున్నట్లు యాక్సియోస్ అనే నివేదిక వెల్లడించింది. నివేదికలోని వివరాల ప్రకారం.. విదేశీ విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలపై కొంతకాలంగా ఏఐ నిఘా కొనసాగుతోంది. విద్యార్థులు వారు చేసిన పోస్టులను తొలగించినప్పటికీ ప్రభుత్వ విభాగాల వద్ద వాటి స్క్రీన్‌షాట్‌లు ఉంటాయి. బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో బహిష్కరణ వేటు పడినప్పటికీ యూఎస్‌లోనే ఉంటున్న అక్రమ వలసదారులను(విద్యార్థులు) గుర్తించడానికి కూడా ట్రంప్ యంత్రాంగం వీటిని ఉపయోగిస్తోంది. ఇందులోభాగంగా ఇప్పటివరకు లక్షకు పైగా విదేశీయుల ప్రొఫైల్‌లను ఫెడరల్ అధికారులు స్కాన్ చేశారు. ఓపెన్ డోర్స్ నివేదిక ప్రకారం..2023-24 విద్యా సంవత్సరంలో అమెరికా రికార్డు స్థాయిలో 1.1 మిలియన్ల అంతర్జాతీయ విద్యార్థులకు ఆతిథ్యం ఇచ్చింది. వీరిలో 3 లక్షలకు పైగా భారత్ నుంచి వచ్చారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటినుంచి అమెరికాకు వ్యతిరేకంగా ఉన్న అన్ని విషయాలపై ఉక్కుపాదం మోపారు. ఇందులోభాగంగానే జాతి వ్యతిరేక ప్రచారానికి పాల్పడుతున్న వారి సోషల్ మీడియా ఖాతాలను అమెరికా విదేశాంగశాఖ జల్లెడ పడుతోంది. ఒకవేళ అదే నిజమని తేలితే ఆ విద్యార్థులకు అమెరికాలో చదువుకునే వీల్లేకుండా తక్షణమే స్వదేశానికి పంపించే యోచనలో ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈమేరకు అమెరికా విదేశాంగశాఖ, కాన్సులేట్ అధికారుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువరించింది. ఈ మేరకు హెచ్చరిక సందేశాలు అందుకున్నవారు.. తమ స్వదేశాలకు వెళ్లేందుకు సీబీపీ హోమ్ యాప్ ఉపయోగించుకోవచ్చని తెలిపింది.

# సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం



గొలుగొండ, (విశాఖ సమాచారమ్):- మండలంలోని పాత మల్లంపేట పంచాయతీలో సీసీ రోడ్లు పనులను సర్పంచ్ గడ్డం ఆదిలక్ష్మి, భర్త ఆనంద్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్, టీడీపీ నాయకులు, గ్రామ నాయకులతో పాటు గ్రామ పెద్ద సువ్వ దేవుడు, వార్డు మెంబర్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గొలుగొండ, (విశాఖ సమాచారమ్):- మండలంలోని లింగంపేట తీర్థ మహోత్సవం దగ్గర లో గుర్తు తెలియని మృతదేహం లభ్యంమైంది. ఎండ వేడికి సృహకోల్పవడం వలన మృతి చెంది ఉంటాడని పలవురు భావిస్తున్నారు.

# ఘనంగా ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం



రావికమతం, (విశాఖ సమాచారమ్):- మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వంకాయల రామారావు అధ్యక్షతన ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడు, సరోజిని ఆధ్వర్యంలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మేడివాడ హైస్కూల్ విద్యార్థులకు ఆటిజం వ్యాధిపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానోపాధ్యాయులు వంకాయలు రామారావు, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడు, మేడివాడ హైస్కూల్ ఉపాధ్యాయులు అప్పలనాయుడు, నాగేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. అలాగే ఈమధ్య 10వ తరగతి దివ్యాంగ విద్యార్థులకు స్క్రైబులుగా సహాయకులుగా పరీక్షలు రాసిన విద్యార్థులకు బహుమతులను అందజేయడంతో పాటు దుస్తులను కూడా వితరణగా అందించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఆటిజం వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

# ఉపాధి హామీ పనులతో గ్రామాభివృద్ధికి తోడ్పాటు

## హోం మంత్రి అనిత



నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):- మండలంలోని పెద్దనార్ల గ్రామపంచాయతీలో రాష్ట్ర హోం మంత్రి అనిత సహకారంతో, కొన్ని అనివార్య కారణాలవల్ల ఆగిపోయిన ఉపాధి హామీ పథకం క్రింద పనులు తిరిగి ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో అవసరమైన పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి, రాష్ట్ర హోం మంత్రి అనిత ప్రేరణ ఇచ్చారు. ఈ పథకం అమలులో భాగంగా, గ్రామ ప్రజలు నేరుగా లబ్ధి పొందుతున్నారు. గ్రామంలో ఆర్థికంగా వృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల జరుగుతుండడం ద్వారా, గ్రామస్థులు సంతోషంగా ఉన్నారు. ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టిన పనులు గ్రామాభివృద్ధికి తోడ్పడతాయని హోం మంత్రి శ్రీమతి అనిత ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రకృతి వ్యవసాయ మండల కన్వర్జెన్స్ సమావేశం

జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- ప్రకృతి వ్యవసాయము కన్వెర్జన్సీ సమావేశం పాడేరు మండల మహిళా సమైక్య భవనంలో బుధవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ భాగంగా రైతు సాధికార సంస్థ, వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖలు, వెలుగుశాఖ అధికారులతో పాటు ప్రకృతి వ్యవసాయము సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ప్రకృతి వ్యవసాయ 9సూత్రాలు, పీఎండీఎస్, ఏటీఎం, ఏగ్రేడ్ పంటలు వేసి నిరంతరం ఆదాయ పంటలు వేసి భూమి సారవంతం చేయాలని, 365 రోజులు నిరంతం పంటలతో భూమిని కప్పబడి ఉంచాలని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ఎందుకు చేయాలి; ప్రకృతి వ్యవసాయం చేయడం వలన కలిగే లాభాలు గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో మహిళా సంఘం సభ్యుల పాత్ర ముఖ్యమైందని ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని భూమి లేని వారు కనీసం పెరటి తోటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, మండల వ్యవసాయ అధికారి సూర్య కళ, హార్టికల్చర్ అధికారులు, వెలుగు ఏపీఎం చిన్న రావు, జిల్లా సమాఖ్య లీడర్లు, వెలుగు సీసీ లు, వీఏఏలు, వీఓఏ లు, వాసన్ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సేవల్లో జాప్యం తగదు

## కలెక్టర్ విజయ కృష్ణన్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- రెవెన్యూకు సంబంధించిన సేవల్లో జాప్యం ఉండకూడదని, సేవల సంబంధిత దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. బుధవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంనుంచి రెవెన్యూ శాఖకు సంబంధించిన రీసర్వే, మ్యుటేషన్లు, ఇంటి స్థలాలు క్రమబద్ధీకరణ, నీటితీరువా వసూలు తదితర అంశాలపై తహసీల్దార్లతో జిల్లా కలెక్టరు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సేవలకు సంబంధించిన దరఖాస్తులపై గడువులోపల చర్యలు తీసుకోవాలని తెలిపారు. రీసర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. కొన్ని మండలాలలో ఆటో మ్యుటేషన్లు పెరగడం, ఎక్కువ మ్యుటేషన్లను తిరస్కరించడంపై నివేదిక అందజేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. దీనిపై రెవెన్యూ డివిజినల్ అధికారులు రోజువారీ పర్యవేక్షణచేసి నివేదిక అందించాలని తెలిపారు. అభ్యంతరం లేని ప్రభుత్వ భూములలో 15.10.2019 నాటికి ఇళ్లు కట్టుకొని, ప్రస్తుతం నివాసముంటూ, ఇంటికి సంబంధించిన ఆధార పత్రాలు కలిగి, ఎక్కడా ఇళ్లు లేని వారికి ప్రభుత్వం కల్పించిన క్రమబద్ధీకరణ పథకానికి సంబంధించిన ధరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. కొత్తగా ఇంటి స్థలాలకొరకు దరఖాస్తు చేసుకొన్నవారికి కేటాయించుటకు ప్రస్తుతం గల లేఅవుట్ లలో అందుబాటులో గల స్థలాల వివరాలు సేకరించి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. రీ-సర్వే కు సంబంధించి వివరాలు సమోదు, హద్దులు నిర్ణయం భూయజమానులు సమక్షంలోనే చేయాలని, భూమిలేనివారికి భూమిఉన్నట్లు నమోదు చేసిన యెడల కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయకట్టు భూములకు నీటితీరువా వసూలు చేయాలని, జిల్లాలో సుమారు 17కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని, వారంరోజులలో వసూలు పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి పెండింగ్ లేకుండా వెంటనే కోర్టులలో కౌంటర్లు దాఖలుచేయాలని జిల్లా కలెక్టరు తెలిపారు. సమాచార హక్కుచట్టం ద్వారా వచ్చే ధరఖాస్తులకు మీ దగ్గర గల సమాచారాన్ని వెంటనే గడువులోపల అందించాలన్నారు. పదవీ విరమణ చేయుచున్న ఉద్యోగులకు సంబంధించిన పెన్షను ప్రపోజల్స్ ముందుగానే పంపించాలని, వారికి అందించవలసిన ఆర్థిక ప్రయోజనాలను పదవీవిరమణ రోజునే అందించి, గౌరవప్రదంగా సాగనంపేలా చర్యలు తీసుకోవాలని తెలియజేసారు. జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చాలని, అందుకుగాను నాటుసారా కు సంబంధించిన సమాచారాన్ని గ్రామ అధికారులు ఎక్సైజ్ శాఖకు అందించాలని, ఎక్సైజ్ శాఖ వారు దాడులు చేసినప్పుడు వారికి సహకరించాలని తెలిపారు. నాటు సారా తయారీ, రవాణా విక్రయాలు చేస్తూ, తరచూ నేరం చేసేవారిపై బైండోవరు చేసేటప్పుడు కఠినంగా వ్యవహరించాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం ఉచిత విద్యుత్ పొందుతున్న ఎస్.సి., ఎస్.టి. వినియోగదారులకు ఉచిత కరెంటు అందించుటకు వారి ఇంటిపై సోలారు యూనిట్లు ఏర్పాటు చేయాలని, స్థలం లభ్యత లేని వారికి సరఫరాచేయుటకు ఏపిఇపిడిసిఎల్ ద్వారా సోలారు యునిట్ ఏర్పాటుకు కనీసం 50 సెంట్లు ఉండేవిధంగా భూమిని గుర్తించి వివరాలు అందించాలని తెలిపారు. అందుకుగాను లేఅవుట్ లలో సామాజిక అవసరాలకు విడిచిపెట్టిన స్థలాలను కూడా పరిశీలించాలని జిల్లా కలెక్టరు పేర్కొన్నారు. జాయింటు కలెక్టరు ఎమ్.జాహ్నవి మాట్లాడుతూ రెండో విడత రీసర్వే చేపడుతున్న గ్రామాలలో గ్రామసభలు నిర్వహించాలని, రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముందుగా భూయజమానులకు నోటీసులు అందజేయాలని తెలిపారు.

సర్వేకు అదనపు సిబ్బంది అవ సరమైతే కేటాయించడం జరుగుతుందని తెలిపారు. వార్తాపత్రికలలో వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే చర్యలు తీసుకొని, నివేదికను అందజేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, సర్వే ల్యాండ్ రికార్డ్సు సహాయ సంచాలకుడు గోపాలకృష్ణ, కె.కె.ఆర్.సి. స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్. మూర్తి, ఆర్.డి.ఒ.లు, కలెక్టరు కార్యాలయ సూపరింటెండెంట్‌లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# చింతపల్లి వారపు సంతలో ట్రాఫిక్ సమస్యకు చెక్



చింతపల్లి,, (విశాఖ సమాచారమ్):- మన్యంలో ప్రతీ రోజు ఏదో ఒక గ్రామంలో వారపు సంతలు జరుగుతూ ఉంటాయి.. ఈ మేరకు సోమవారం మండలం లోని అన్నవరం గ్రామం లోనూ,మంగళవారం లోతుగెడ్డ జంక్షన్ లోనూ బుధవారం చింతపల్లి లోనూ, గురువారం లంబసింగి, శుక్రవారం పెదవలస, శనివారం సప్పర్ల, ఆదివారం కోరుకొండ, జర్రెల, ధారకొండ, సీలేరు ఇలా ప్రతీ రోజు ఆయా గ్రామాలలో వారపు సంతలు జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే.ఇందులో భాగంగా ప్రతీ బుధవారం మండల కేంద్రమైనా చింతపల్లిలో వారపు సంత జరుగుతుంది..అయితే చింతపల్లి లో జరిగే ఈ వారపు సంతకు మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులతో పాటు ఏజెన్సీ లోని చిరు వ్యాపారులు వివిధ వాహనాలలోఅధిక సంఖ్యలో వచ్చి వ్యాపారాలు సాగిస్తూ ఉంటారు.అదే క్రమంలో వీటిని కొనుగోలు చేసేందుకు మండలం లోనే కాకుండా, అన్నీ ప్రాంతాలకు చెందిన ప్రజలు సంతకు వచ్చి, వారికి కావలసిన వివిధ రకాల వస్తువులు తో పాటు కూరగాయలు తదితర వాటిని కొనుగోలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో వారపుసంత జనాలతో కిక్కిరిసిపోతోంది. అదే క్రమంలో చిరు వ్యాపారులు కూడా రోడ్డుకు ఇరువైపుల దుకాణాలు వేసి, వ్యాపార లావాదేవీలు సాగించుతుంటారు..దీంతో వచ్చే పోయే వాహనాలతో రోడ్ పై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగి, ట్రాపిక్ సమస్య ఏర్పడుతోంది.దీనిని అధిగమించేందుకు పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు.స్థానిక ఎస్ ఐ వెంకటేశ్వరరావు తో పాటు, రెవెన్యూ శాఖ అధికారులు సంత జరిగే ప్రాంతాన్ని సందర్శించి,వ్యాపారులకు పలు సూచనలు ఇచ్చారు.వ్యాపార దుకాణాలను రోడ్‌పై నుంచి తొలగించి,డెయిరీ ఫారం క్వార్టర్స్ సమీపం లో నున్న సంత మార్కెట్ షెడ్లను(నాబార్డ్ నిధుల తో ఏర్పాటు చేసిన సంత మార్కెట్ షెడ్లు) వ్యాపారులు ఉపయోగించుకోవాలని ఆదేశించారు. ఈ నేపధ్యంలో వారపు సంత రోడ్ మీద కాకుండా షెడ్‌లు నిర్మించిన ప్రాంతంలో వ్యాపారులు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో చింతపల్లి వారపు సంతకు ట్రాపిక్ ఇక్కట్లు తొలగిపోయాయి. కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ పంచాయతీ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అవంతి కళాశాల 25వ వార్షికోత్సవం



మాకవరపాలెం, (విశాఖ సమాచారమ్):- అనకాపల్లి జిల్లా మాకవరపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాల టెక్ వైబ్-2025 పేరుతో 25వ, వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. అవంతి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం- విశాఖపట్నం ఉపకుల పతి ప్రొఫెసర్ డి.సూర్య ప్రకాష్‌రావు ముఖ్య అతిథి గా, డాక్టర్ బిందు మాధవి హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్, సీఎస్ ఈ, జేఎన్టీయూ జీవీ-విజయనగరం, అసోసియేట్ డైరెక్టర్ ఎస్ ఎస్ టి ఎల్-విశాఖపట్నం ఎస్. రవి కుమార్, పెన్నెంట్ టెక్నాలజీస్-విశాఖపట్నం సెంటర్ మిస్టర్ కె.షఫీ ఖాన్ అతిథులుగా హాజరయ్యారు.ముఖ్య అతిథి ప్రొఫెసర్ డి.సూర్య ప్రకాష్‌రావు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చునన్నారు. అవంతి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ మీ విలువైన సమయాన్ని వృధా చేయకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని పొంది వినూత్న ఆలోచనలతో ఆర్థికాభివృదితో పటు దేశాభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఆటలు పోటీలలో గెలిపొందిన వారికి అతిథులు చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సామజిక, దేశభక్తి, వినోదం ఇతివృత్తంతో కూడిన సోలో, గ్రూప్ నృత్యాలు, పాటలు ఎంతగానో అలరించాయి.

# నిఘా నీడలో అమ్మవారి అలయం



గొలుగొండ, (విశాఖ సమాచారమ్):- లింగం పేట నూకాలమ్మ తల్లి ఆలయంలో దేవాదయశాఖ అదికారులు, పోలీసుల ఆధ్వర్యంలో సీసీ కెమెలు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ, ఈవో దివ్య తేజ సీసీ కెమెరాలను పరిశీలించారు.

# పాలిసెట్-2025కు ఉచిత శిక్షణ

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- పాలిసెట్-2025 పరీక్షకు సిద్ధం అవుతున్న విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ పాలిటెక్నిక్, అనకాపల్లి నందు ఇచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ పాచిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.అత్యంత అనుభవజ్ఞులైన పాలిటెక్నిక్ లెక్చరర్స్ చే ఈ శిక్షణా కార్యక్రమము నిర్వహింపబడుతుందన్నారు. పాలీసెట్ - 2025 పరీక్షకు ధరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థి ఈ సదావ కాశాన్ని వినియోగించుకోవలసిందిగా ప్రిన్సిపాల్ విద్యార్థులకు సరిచించారు. శిక్షణా తరగతులు తేది.03.04.2025 నుండి ప్రారంభమగునని, శిక్షణ తరగతులు ప్రతీ రోజు ఉదయం 9.30 గంటల నుండి 12.30 గంటల వరకు కళాశాల లోని బ్లాక్-3 నందు నిర్వహించ బడునని, ఆసక్తి కల విద్యార్థులు 9398848767, 8919790483 ఫోన్ నంబర్ లలో సంప్రదించి మిగతా వివరాలు తెలుకోవలసినదిగా తెలియజేశారు.

# 5న కలెక్టరేట్ లో బాబూ జగ్జీవన్ రాం 118వ జయంతి వేడుకలు

విజయనగరం, (విశాఖ సమాచారమ్):- స్వర్గీయ మాజీ కేంద్ర మంత్రి, బడుగు బలహీన వర్గాల నాయకుడు బాబూ జగ్జీవన్ రాం 118వ జయంతి వేడుకలను సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 5వ తేదీ ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, పలు సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

# ఘనంగా సీతారాముల పందిరి రాట మహోత్సవం



పరవాడ, (విశాఖ సమాచారమ్):- మండల కేంద్రమైన పరవాడలో శ్రీరామనవమి మహోత్సవం సందర్భంగా బుధవారం రామాలయం వద్ద ఎంపీపీ దంపతులు పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు దంపతులు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు దంపతులు పాల్గొని పందిరి రాట వేశారు.అనంతరం రామాలయంలో విశేష పూజలు జరిపించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా ఉదయం నుండి శ్రీ సీతారాముల వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుపుతున్నట్లు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం, సాయంత్రం గ్రామ పురవీధుల్లో సాంస్కృతిక, నృత్య కోలాటంతో స్వామివారి ఊరేగింపు ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బండారు రామారావు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు, వార్డు మెంబర్ గండి ఈశ్వరరావు, పైల అప్పలనాయుడు సత్యవేణి, సిరపరపు అయ్యబాబు, పైల అప్పారావు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాలు కూల్చివేయాలని వినతి



అరకులోయ, (విశాఖ సమాచారమ్):- అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వేలీ మండలం సుంకర మెట్ట పంచాయతీ సుంకర మెట్ట సంత నిర్వహించే ఖాళీ స్థలంలో గిరిజన నేతరుడు సుంకర మెట్ట గ్రామంలో నివసిస్తున్న చెబోళ్ల రమేష్ బినామీ కొర్ర గాసి పేరుతో నిర్మిస్తున్న అక్రమ కట్టడన్ని కూల్చివేయాలని ఆదివాసీ గిరిజన సంఘం అధ్వర్యంలో అరకు వేలి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జి బాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గిరిజ నేతరులు బినామీ పేర్లతో విచ్చలవిడిగా ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు.రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమం లో గిరిజన సంఘం మండల నాయకులు కె.రామారావు పి.నాని బాబు పి.రామన్న పాల్గొన్నారు.

# క్షయ నివారణపై అవగాహన సదస్సు



చోడవరం, (విశాఖ సమాచారమ్):- స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఒకటి రెండు మూడు, ఎన్ వై కె, కమ్యూనిటీస్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం క్షయ నివారణ అవగాహన సదస్సును కళాశాల అధ్యక్షుడు డాక్టర్ పి.కిరణ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నెహ్రూ యువ కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషకమన్నారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల నుంచి అవగాహన కలిగించుకొని గ్రామీణ ప్రాంతంలో చైతన్యవంతం చేయాలని తెలియజేశారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు వాటి నివారణ గురించి విద్యార్థులకు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో ఎన్వైకే సభ్యులు ఈ వినయ్ కుమార్ పి.ప్రసన్నకుమార్ హెల్త్ సెంటర్ సభ్యులు వి.సత్తిబాబు, ఎం.పుష్ప, వైస్ ప్రిన్సిపాల్ ఐవీవీ సత్యవతి,వి.అప్పల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక కేంద్రాల్లో బియ్యం, కందిపప్పు విక్రయాలు

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అమ్మకాల కేంద్రాల్లో బియ్యం , కందిపప్పు ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం విక్రయిస్తున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్. మూర్తి తెలిపారు. బుధవారం ఒక దినపత్రికలో వచ్చిన వార్తకు వివరణ ఇస్తూ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వారి నుండి నెలవారీ కందిపప్పు కోటా అందని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా చౌక ధరల దుకాణాల ద్వారా సరఫరా కావడం లేదన్నారు. అందువల్ల ప్రత్యేక కేంద్రాల్లో బియ్యం బీపీటీ / సోనామసూరి (స్టీమ్డ్) వెరైటీ కిలో రూ.49 , బీపీటీ / సోనామసూరి (పచ్చి), వెరైటీ కిలో రూ.48, కందిపప్పు కిలో రూ.160కు అమ్మకం జరపాలని నిర్ణయించినట్టు తెలిపారు. ప్రస్తుతం అనకాపల్లిలో 8, చోడవరంలో 6, సబ్బవరంలో 5, ఎలమంచిలిలో 2, కశింకోటలో 1, రాంబిల్లిలో 1, నర్సీపట్నంలో 5, రోలుగుంటలో 2, నాతవరంలో 1, నక్కపల్లిలో 1, ఎస్.రాయవరంలో 1, పాయకరావుపేటలో 2, కోటఉరట్లలో 2, బుచ్చియ్యపేటలో 2, మాడుగులలో 2, మాకవరపాలెంలో 2, రావికమతం 3, కె.కోటపాడులో 5, దేవరాపల్లిలో 1, చీడికాడలో 1, పరవాడలో 2, అచ్చుతాపురంలో 2 ప్రత్యేక అమ్మక కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ప్రజల అవసరాల కనుగుణంగా కేంద్రాలు పెంచడం జరుగుతుందని ఆయన తెలిపారు.

విశాఖ సమాచారమ్

గురువారం 3-4-2025

# విద్యకు పెద్ద పీట వేయాలి

"చరిత్రలో ఉత్తమంగా కనబడుతున్న దేశాలన్నీ తమ ప్రజల విద్య కోసం అధికంగా పెట్టుబడి పెట్టినవే." అంటారు అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా. అందుకే అమెరికా లాంటి అగ్రరాజ్యాల్లో విద్యకు ఎక్కువ నిధులు కేటాయిస్తారు. 12వ తరగతి (మన దేశంలో ఇంటర్ మీడియట్) వరకు వారు నాణ్యమైన ఉచిత విద్య అందిస్తున్నారు. ఆ తరువాత ఉన్నత విద్య చదువుకోదలచిన వారికి మాత్రం ఫీజులు ఉంటాయి. అయితే మన దేశంలో మాత్రం విద్యాభివృద్ధికి కేటాయిస్తున్న నిధులు అరకొరే! దేశంలో చాలా రాష్ట్రాలు విద్యాభివృద్ధికై బడ్జెట్‌లలో 10 నుంచి 12 శాతం వరకు నిధులు కేటాయిస్తున్నాయి. పెరుగుతున్న విద్య అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి సంవత్సరం నిధులు పెంచడం తప్పనిసరి. అలా జరిగితేనే విద్య అందరికి అందుబాటులో ఉంటుంది. అయితే అందుకు భిన్నంగా ఈ విద్యాసంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం 23,108 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇది మొత్తం బడ్జెట్‌లో 7.57%. ఇందులో మాధ్యమిక విద్యకు 19,464 కోట్లు, ఉన్నత విద్యకు 3,643 కోట్లు కేటాయించారు. గత సంవత్సరంతో పోలిస్తే అంకెలలో అధికంగా కనబడినప్పటికి కేటాయింపులలో 0.20% తగ్గుదల ఉంది.

యూనివర్సిటీలకు కేటాయింపులు మరీ దారుణం. అలాగే ఏపీలో పాఠశాల విద్యకు రూ.31,805 కోట్లు (9.86 శాతం) కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఉన్నత విద్యాశాఖకు కేవలం రూ.2,506 కోట్లు కేటాయించారు. ఇవి కేవలం యూనివర్సిటీల నిర్వహణకు, సిబ్బంది జీతభత్యాలకే సరిపోతుంది. మరి మౌలిక వస తులు, అభివృద్ధి ప్రణాళికల సంగతి ఎలా? ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాల పేరిట ఇబ్బడి ముబ్బడిగా నిధులు ఖర్చుచేసే బదులు, పేద పిల్లలు చదివే ప్రభుత్వ యూనివర్సిటీలను, కళాశాలలను, పాఠశాలలను, హాస్టల్‌లను బలోపేతం చేయడానికి బడ్జెట్‌లో మరింత నిదులు కేటాయిస్తే బాగుండేది. దీనివలన నాణ్యమైన విద్య అందరికి సమానంగా అందేది. అభివృద్ధి అంటే పైపై మెరుగులు, కొందరికి ప్రాధాన్యత కాదు. అందరికి సమాన అవకాశాలు అందాలి. అది కేవలం విద్య ద్వారానే సాధించబడుతుంది. సమాజంలో శాశ్వత, గుణాత్మక అభివృద్ధి మార్పులు విద్య ద్వారానే సాధ్యం. అయితే నిధులు కేటాయించడమే కాదు, వాటిని విడుదల చేయడం, ఉద్దేశించిన రీతిలో పారదర్శకంగా ఖర్చు చేయడాన్ని పర్యవేక్షించడం అంతకంటే ముఖ్యం. లేదంటే ప్రచార ఆర్భాటం కోసం వేసుకున్న లెక్కల పద్దులుగా బడ్జెట్‌ను ప్రజలు భావించే అవకాశం ఉంది. గతంలో అమ్మ ఒడి... ప్రస్తుతం తల్లికి వందనం... పథకాలకంటే... అందరికీ నాణ్యమైన ఉచిత విద్య అందించడం ఎంతైనా అవసరం.

పంచాంగం

గురువారం 3-4-2025

శ్రీ విశ్వావసు నామ సంవత్సరము

ఉత్తరాణాయణం, వసంత రుతువు

చైత్ర మాసం

| | |
|---|---|
| తిథి | : శు. షష్ఠి రా. 9.42 |
| నక్షత్రం | : రోహిణి ఉ. 7.02 |
| వర్జ్యం | : ప. 12.21 ల 1.52 |

# భారతీయ వైద్య పితామహుడు చరకుడు

"రోగం రావడం కంటే ముందే రాకుండా నివారించడం మేలు" అన్నమాట చెప్పింది చరకుడు. ఆయనను వైద్య పితామహుడు గా భారతదేశం కీర్తిస్తుంది. కనిష్క మహారాజు ఆస్థానంలో వైద్యులు గా ఉన్నారని కొందరి చరిత్రకారుల అభిప్రాయం. శారీరక, మానసిక ఆరోగ్యాలు సరిగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా గుర్తిస్తామని చరకుడు తెలిపారు. పల్లెపల్లె తిరిగి వైద్యం చేసి చరకుడు,శిష్యులు ఆయుర్వేదాన్ని బహుళ వ్యాప్తికి దోహద పడ్డారు.ప్రతిపల్లెలోనూ ఆయుర్వేద వైద్యుడు ఉండేలా ఆయన, ఆయన శిష్యుల కృషే కారణం. పల్లెల్లో ఉన్న చరకులు(శిష్యులు) కాల క్రమేణా క్షురక కులాలుగా మారారని చెబుతారు.

ఆయుర్వేద శాస్త్రానికి సుశ్రుతుడు గుండె అయితే చరకుడు వెన్నుముక లాంటివాడు. భారతీయ ఆయుర్వేదానికి పరిపూర్ణత కల్పించి, ప్రపంచ ప్రాముఖ్యత కల్పించాడు. చరకుడు కీ.పూ 8వ శతాబ్దానికి చెందినవాడు.చరకుడు అంటేనే సంచారం. చరకుడు తన శిష్యులతో గ్రామాలు తిరుగుతూ ప్రజలకు వైద్యసేవలు అందించేవారని నాటి గ్రంథాలు చెబుతున్నాయి.చరకుడు కాశ్మీరానికి చెందినవాడు. సుశ్రుతుడి వలె చరకుడు కూడా గొప్ప ఆయుర్వేద పండితుడు. ఆయన "చరకసంహిత" అనే సమగ్రఆయుర్వేద గ్రంథాన్ని రచించారు. ఈ గ్రంథాన్ని వ్యాఖ్యానాలు రాసిన వారిలో కాశ్మీర కుడు,ధ్రువబాల ప్రముఖులు.ఈ గ్రంథం 10శాతాబ్దంలో అరబ్,పర్షియన్ భాషల్లోకి అనువదింపబడింది. ఈ గ్రంథంలో 120 అధ్యాయాలు ఉన్నాయి. చివరి 17 అధ్యాయాలు చికిత్సా విధానం మీద ధృవబాల రచించాడని ఒక వాదన.

వ్యాధులు ముఖ్యంగా వాత, పిత్త, శ్లేష్మం దోషాలతో వస్తాయని చరకుడు సూత్రీకరించాడు. తినే ఆహారంతో సంఘర్షణ తల ఎత్తినప్పుడు అవివస్తాయి. మానవ శరీరంలోని మూడు దోషాలు సమతుల్యత లోపం వల్ల వ్యాధి వస్తుందని తెలిపారు. వైద్యులకు ఉండవలసిన నైతిక నియమావళి వివరించారు. ప్రాచీన వైద్యుడు అత్రేయ రాసిన అగ్నివేశ,అగ్ని సంహిత వైద్య సంకలనాన్ని చరకుడు మరింత ఆధునీకరించాడని చరిత్ర కారులు చెబుతున్నారు. ఉసిరి, తానికాయ, కరక్కాయ చూర్ణం (త్రిఫల చూర్ణం) చరకుడు చెప్పినదే. వ్యాధి చికిత్స కు ముందు నిర్ధారణ పరిక్ష అవసరమని ఆనాడే చరకుడు చెప్పాడు.ఆనాడే పక్షవాతం, మూర్ఛ, కుష్టు వ్యాధులకు నివారోపయాలను చరకుసంహితలో పొందుపరిచారు. రోగాన్ని తగ్గించే శక్తి పాదరసానికి ఉందన్నాడు. ఎన్నో మొండి రోగాలను పాదరసం పుటం పెట్టి రోగం నయం చేసిన పద్ధతి వైద్య ప్రముఖులను ఆశ్చర్యానికి గురి చేసింది.నేటి ఆధునిక వైద్యులు చేస్తున్న అల్ట్రాసోనిక్ చికిత్స విధానానికి చరకుని సిద్ధాంతమే ప్రేరణ. మంచి ఆలోచనలు మంచి ఆరోగ్యం ఇస్తుందని,ఆహారవిహారాల్లో పరిశుభ్రత విధిగా పాటించాలన్నారు.

ప్రాచీన ఆయుర్వేద గ్రంథాలలో చరకుని గురించి ఒక కథ ప్రచారంలో ఉంది. క్షీరసాగర మథనంలో పుట్టిన వైద్యుడు ధన్వంతరి. ఆయుర్వేద విజ్ఞానాన్ని మొదటి సర్పరాజైన ఆదిశేషునికి బోధించాడు. ఒకసారి భూలోకానికి వచ్చిన ధన్వంతరి తీవ్రమైన వ్యాధికి గురవడంతో ఒక ముని కుమారుడు ఆయనకు చికిత్స చేసాడు. ఆ ముని కుమారుడే చరకుడుగా చెబుతారు.



వైద్యానికి చెందిన దేవతలు అశ్వనీ దేవతలే తనచేత చరక సంహిత గ్రంథస్థం చేయించారని రాసుకున్నాడు.ప్రముఖ సంస్కృత,ప్రాకృత వ్యాకరణ పండితుడు పాణినీ చరకుడి సహాధ్యాయి.ఆయన తన గ్రంథాల్లో అనేక విశేషాలను వెల్లడించారు. చరకుడు ఆయుర్వేద వైద్య శాస్త్రాన్ని ఎలా రాసారో వివరించాడు.

'ఆయుర్వేద శాస్త్రం రాయడానికి చరకుడు తన ఇంటి ముందున్న చెట్టు క్రింద కూర్చున్నాడు. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.ఆ సమయంలో చెట్టు మీద వాలిన కొంగ అరవడం ప్రారంభించింది.పక్షి అరుపు "కోరుక్ అన్నట్టు వినిపించింది. సంస్కృతంలో "కోరుక్" అంటే ఎవరు ఆరోగ్యవంతుడు అని అర్థం. చరకుడు వెంటనే "హితబుక్"అని సమాధానం చెప్పాడు. హితబుక్ అంటే భుజించే వాడని అర్థం.హితంగా అంటే శరీరానికి ఎంతో అవసరమో అంతే భుజించాలి అని అర్థం.అయినా పక్షి అరుస్తునే ఉంది. ఈ సారి "మితభుక్ "అన్నారు.అంటే మితంగా తినేవాడని అర్థం. అయినా అరుస్తునే ఉంది.కొద్ది సేపు ఆలోచించి" మేథ్య భుక్" అన్నాడు. అయినప్పటికీ పక్షి ఆపలేదు.ఈ సారి మరింత దీర్ఘంగా ఆలోచించి "హితం, మిత, మేథ్య భుక్" అన్నాడు.అంతపక్షి రెక్కలు టపటపలాడిస్తూ ఎగిరిపోయింది. హితంగా,మితంగా, పరిశుభ్రం గా భుజించే వాడిని ఈ వాక్యం అర్థం.అశ్వనీ దేవతలే పక్షి రూపంలో వచ్చి రచనకు పునాది వేసారని ఆయన భావించాడు. ఈ కథను పాణినీ స్వయంగా లోకానికి వెల్లడించారు. ఆయుర్వేద శాస్త్రంలో ఈ ఆరోగ్యసూత్రాన్ని పాటించాలని చరకుడు చరకసంహితలో మొదటివాక్యంగా రాసాడు. ఆయుర్వేద శాస్త్రాన్ని వేదంలోని అధర్వణ వేదం ఉపవేదంగా చెబుతారు.

ఆధునిక వైద్యులు రోగానికి కారణం వైరస్, బ్యాక్టీరియా వంటి సూక్ష్మక్రిములు కారణమని చెబుతారు. కాని చరకుడు అహితాహారం వల్ల వ్యాధులు వస్తాయని సూత్రీకరించాడు. గాలి, నీరు, స్పర్శవల్ల శరీరంలోని సూక్ష్మక్రిములు ప్రవేశించినా శరీర క్షేత్రం పరిపుష్టిగా ఉంటే అవేమీచేయలేవని ఆయుర్వేదంలో చరకుడు చెప్పాడు.అపథ్యకరమైన ఆహారం వల్లే శరీరానికి వ్యాధులు వస్తాయని తేల్చిచెప్పారు.

ఆయుర్వేదాన్ని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చినవారు సుశ్రుతుడు,చరకుడు అనడంలో సందేహం లేదు. 2000 ఏళ్ల పూర్వమే వైద్య విధానాలు రూపొందించి ప్రపంచానికి మార్గదర్శకులుగా మారిన వారు భారతీయులు కావడం మనకు నిజంగా గర్వకారణం.

**యం.వి.రామారావు, 8074129668**

# సెల్యూట్.. నీరజ్ సాబ్..

ఈరోజుల్లో.. తృప్తికి, ఆశకి అస్సలు హద్దు ఉండదు

"ఇంకా కావాలి,

ఇంకా ఇంకా కావాలి,

మొత్తం నాకే కావాలి" ఇదే నేటి మనుష్యుల ఆలోచన..

మేధస్సు మరియు వినోదాన్ని మిళితం చేసే "కౌన్ బనేగా కరోడ్‌పతి" షోని అందరూ ఆనందిస్తున్నారు..

ఇది అందరి జ్ఞానాన్ని పెంచుతుంది కూడా..

అందరి సమాధానాలు సరైనవి అయినప్పుడల్లా అందరు చాలా సంతోషిస్తారు..

ఇటీవలి ఎపిసోడ్‌లో నీరజ్ సక్సేనా అనే వ్యక్తి "ఫాస్టెస్ట్ ఫింగర్" రౌండ్‌లో అత్యంత వేగంగా సమాధానమిచ్చి హాట్ సీట్‌లో నిలిచాడు..

అతను అరవకుండా,డ్యాన్స్ చేయకుండా,ఏడవకుండా,చేతులు ఎత్తకుండా, అమితాబ్‌ను కౌగిలించుకోకుండా చాలా ప్రశాంతంగా కూర్చున్నారు..

నీరజ్ పీహెచ్ డీ చేసిన ఒక శాస్త్రవేత్త. కోల్‌కతాలోని ఒక విశ్వవిద్యాలయానికి వైస్-ఛాన్సలర్.

అతను ఆహ్లాదకరమైన, సరళమైన వ్యక్తిత్వం కలిగి ఉన్నారు.

డా. ఎ.పి.జె.తో కలిసి పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నాను అని చెప్పారు..

నేను మొదట నా గురించే ఆలోచించేవాడేనని.. అబ్దుల్ కలాం ప్రభావంతో నేను ఇతరుల గురించి మరియు దేశం గురించి కూడా ఆలోచించడం ప్రారంభించానని చెప్పారు. నీరజ్ ఆడటం మొదలుపెట్టారు.

అతను ప్రేక్షకుల పోల్‌ను ఒకసారి ఉపయోగించాడు, కానీ అతను "డబుల్ డిప్" లైఫ్‌లైన్‌ని కలిగి ఉన్నందున, అతను దానిని మళ్లీ ఉపయోగించుకునే అవకాశం పొందాడు.

అతను అన్ని ప్రశ్నలకు సులభంగా సమాధానం చెప్పాడు. అతని తెలివితేటలు ఆకట్టుకున్నాయి.

అతను రూ. 3,20,000లతో పాటు సమానమైన బోనస్ మొత్తాన్ని గెలుచుకున్నాడు.

ఆపై విరామం లభించింది.

విరామం తర్వాత అమితాబ్ "ముందుకు వెళ్దాం డాక్టర్ సాహబ్ అన్నారు.

ఇదిగో పదకొండో ప్రశ్న "అని ప్రకటించాడు,





అప్పుడే నీరజ్ "సార్ నేను నిష్క్రమించాలనుకుంటున్నాను" అని చెప్పాడు.

అమితాబ్ ఆశ్చర్యపోయాడు.

ఎవరైనా చాలా బాగా ఆడుతున్నారు,

ఇంకా మూడు లైఫ్‌లైన్‌లు మిగిలి ఉన్నాయి మరియు కోటి (రూ.1,00,00,000) గెలుచుకునే మంచి అవకాశం ఉన్నందున నిష్క్రమిస్తున్నారా? ఇంతకుముందెప్పుడూ ఇలా జరగలేదు

ఎందుకు క్విట్ అంటున్నారు అని అడిగాడు.

నీరజ్ ప్రశాంతంగా సమాధానమిచ్చారు.

"ఇతర ఆటగాళ్లు వేచి ఉన్నారు, వారు నా కంటే చిన్నవారు.. వారికి కూడా అవకాశం రావాలి.. నేను ఇప్పటికే చాలా డబ్బు గెలుచుకున్నాను.. నాకు ఉన్నది చాలు అని నేను భావిస్తున్నాను. నాకు అంతకుమించి కోరిక లేదు.

అమితాబ్ దిగ్భ్రాంతి చెందాడు అక్కడ ఒక క్షణం నిశ్శబ్దం..

అప్పుడు అందరూ లేచి నిలబడి చాలాసేపు చప్పట్లు కొట్టారు.

ఈ రోజు మనం చాలా నేర్చుకున్నాం..

ఇలాంటి వ్యక్తిని చూడటం చాలా అరుదు అని అమితాబ్ అన్నారు.

నిజం చెప్పాలంటే,

ఇతరులకు అవకాశం రావడం గురించి ఆలోచించే ... తమ వద్ద ఉన్నదానికంటే ఎక్కువ అని భావించే వ్యక్తిని నేను ఇదే మొదటిసారి చూడటం

అతనికి మనస్ఫూర్తిగా సెల్యూట్ చేస్తున్నాను అని

అమితాబ్ అన్నారు..

నేడు ప్రజలు కేవలం డబ్బు వెంటే ఉన్నారు..

ఎంత సంపాదించినా తృప్తి ఉండదు,దురాశకు అంతం ఉండదు..

డబ్బు వెంటాడుతూ కుటుంబాన్ని, నిద్రను,ఆనందాన్ని, ప్రేమను, స్నేహాన్ని కోల్పోతున్నారు..

అలాంటి సమయాల్లో డాక్టర్ నీరజ్ సక్సేనా లాంటి వారు గుర్తుకు వస్తారు. ఈ యుగంలో, సంతృప్తి నిస్వార్థ వ్యక్తులు దొరకడం కష్టం...

అతను గేమ్ నుండి నిష్క్రమించిన తర్వాత,

ఒక అమ్మాయి హాట్ సీట్‌లో కూర్చుని తన కథను పంచుకుంది..

"మేము ముగ్గురు కుమార్తెలమైనందున మా నాన్న మమ్మల్ని మా అమ్మతో సహా బయటకు పంపించే సాడు..

ఇప్పుడు మేము అనాథాశ్రమంలో నివసిస్తున్నాము..."

నేను అనుకున్నాను నీరజ్ నిష్క్రమించకపోతే,

ఈరోజు చివరి రోజు కాబట్టి,

మరెవరికీ అవకాశం లభించదు..

అతని త్యాగం కారణంగా ఈ పేద అమ్మాయికి కొంత డబ్బు సంపాదించే అవకాశం వచ్చింది..

నేటి ప్రపంచంలో ప్రజలు తమ వారసత్వం నుండి ఒక్క పైసా కూడా వదులుకోవడానికి సిద్ధంగా లేరు..

దాని మీద కొట్లాటలు,హత్యలు కూడా చూస్తున్నాం..

స్వార్థం ప్రబలుతోంది..

కానీ ఈ ఉదాహరణ మినహాయింపు..

ఇతరుల గురించి,దేశం గురించి ఆలోచించే నీరజ్ లాంటి మనుషుల్లో దేవుడు ఉంటాడు.

ఇలాంటి అరుదైన గొప్ప వ్యక్తి ఎందరికో స్ఫూర్తి ప్రదాత.

ఇలాంటి వ్యక్తిని మనం మరువులేము..

ఇలాంటి గొప్ప వ్యక్తి గురించి రాసే అవకాశం లభించినందుకు సంతోషిస్తున్నాను..

మీ అవసరాలు తీరినప్పుడు,

మీరు ఆపి ఇతరులకు అవకాశం ఇవ్వాలి..

స్వార్థాన్ని విడనాడి అందరూ సంతోషంగా ఉంటారు..

ఇది మన అందరం నేర్చుకున్న పాఠం..

మనం ఎల్లప్పుడూ

ఇలాంటి వ్యక్తులను ఆరాధించాలి..


అలాగే వారి గురించి నిజాయితీగా రాయడం సమాజం యొక్క అభివృద్ధికి అవసరమని నమ్ముతాను.

సెల్యూట్ నీరజ్ సార్.

-(వాట్సాప్ నుంచి సేకరణ)

# పరమాచార్యతో భగవాన్





ఓమారు కంచిపరమాచార్య తిరువణ్ణామ లైకి వెళ్ళినప్పుడు గిరిప్రదక్షిణ చేశారు. ఆయనతో పాటు మరో నలుగురైదుగురు ఉన్నారు. కాస్సేపటికి భగవాన్ రమణ మహర్షి శిష్యులు కొందరు బిక్షపాత్రలతో ఎదురొచ్చారు. పరమాచార్యను చూసి వారు నమస్కరించారు.

మేము భగవాన్ శిష్యులం. భగవాన్ ఆశ్రమంలో ఉన్నారని చెప్పారు.

వెంటనే పరమాచార్య అలాగా అంటూ వారిని చిరునవ్వుతో ఆశీర్వదించి ముందుకు సాగారు.

రమణ మహర్షి భక్తులు ఒకింత జంకుతో నిలబడి వెళ్ళిపోయారు. రమణ మహర్షి గురించి ఆయన క్షేమసమాచారం గురించి పరమాచార్య అడగకపోవడమే కాక తమకు తెలుసన్నట్టు ఎక్కడా మాటల్లో చూపలేదు.

ఆ భక్తులు కొండెక్కి వెళ్ళి శ్రీ రమణ మహర్షికి భిక్షను ఇచ్చి దారిలో పరమాచార్యను కలిసిన విషయాన్ని చెప్పారు. అంతేకాదు, తమ బాధనూ వ్యక్తం చేశారు.

వారి మాటలు విన్న భగవాన్ ఓ చిర్నవ్వు నవ్వారు.

ఒరేయ్ మేమిద్దరం మాట్లాడేసుకున్నాం. ఇప్పుడూ మాట్లాడుకుంటున్నాం. దీనికా మీరు బాధపడుతున్నారు అని అడిగారు.

భగవాన్ భక్తులు నిర్ఘాంతపోయారు.

దీనిని అప్పుడు ప్రత్యక్షంగా చూసిన ఓ ఎనభై ఎనిమిదేళ్ళ స్త్రీ చెప్పడాన్ని ఓ ప్రముఖ రచయిత పూసగుచ్చినట్లు ఓ పుస్తకంలో రాశారు.

పరమాచార్య, భగవాన్ మహాజ్ఞానులు. తపస్సంపన్నులు. వారి మధ్య ఎప్పుడూ ఓ సంభాషణ జరుగుతూనే ఉంటుంది. పాల్ బ్రంటన్ అనే ఆయన ఓ మారు పరమా చార్య వద్దకు ఆధ్యాత్మిక విషయమై మాట్లాడటానికి వెళ్ళారు. అప్పుడు పరమాచార్య ఆయన జ్ఞాన మార్గంలో పోతున్నారు. నేను కర్మ మార్గంలో పోతున్నాను. నీ ప్రశ్నలకు జవాబివ్వగలవారు తిరువణ్ణామలైలో ఉన్నారు. ఆయనను కలుసుకో అన్నారు.

పాల్ బ్రంటన్ ఆ మేరకు రమణ మహర్షిని కలిసి తనకున్న సందేహాలన్నీ అడిగి నివృత్తి చేసుకున్నారు. ఆ క్షణం నుంచీ ఆయన భక్తుడయ్యారు. అంతేకాదు, రమణ మహర్షి గురించి ఓ పుస్తకం కూడా రాసారు. పరమాచార్యకు, భగవాన్ రమణ మహర్షికి పరస్పరం ప్రేమ లేకుంటే ఇది జరిగేనా....ఏదేమైనా పరమాచార్య, భగవాన్ మన దేశానికి లభించిన మహాభాగ్యం.

**- యామిజాల జగదీశ్**

# మరాఠా యోధుడి వారసులు ఎక్కడ?

## నేడు ఛత్రపతి శివాజీ మహరాజ్ వర్ధంతి





భారతదేశ చరిత్రలో గొప్ప యోధులు, సువర్ణాక్షరాలతో లిఖించబడిన పేర్లలో ఛత్రపతి శివాజీ పేరుకు ఎంతో ప్రత్యేకత ఉంది. ఆయన పేరు ఉంటే హిందూ మతం ఉత్సాహంతో ఉప్పొంగిపోతుంది. చిన్నతనంలోనే మొఘలుల దాడులలో హిందూ మతం అంతరించి పోతుందని, వారితో యుద్ధంలో ఓడిపోయి అందరూ చేతులెత్తేసిన వేళ శివాజీ మహారాజు మండే నిప్పు కణికలా దూసుకొచ్చాడు. మొగల్ రాజులతో ఎంతో వీరోచితంగా పోరాడాడు. అందుకే హిందూమతాన్ని కాపాడిన ఘనత ఒక్క మరాఠా మహారాజు శివాజీకే దక్కుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అందుకే ఆ యోధుడి జయంతి, వర్ధంతులను భారతదేశ వ్యాప్తంగా జరుపుకుంటారు. ముఖ్యంగా మహారాష్ట్రలో ఒక పండుగలా నిర్వహిస్తారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ వారసులు ఉన్నారా? ఉంటే ఎక్కడ నివసిస్తున్నారు? అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకుందాం..

ఛత్రపతి శివాజీ మహారాజ్ 1680 ఏప్రిల్ 3న తన రాయ్‌గడ్ కోటలో మరణించారు. ఆయన వారసులు నేటికీ బతికే ఉన్నారు. మహారాష్ట్రలో నివసిస్తున్న ఉదయన్ రాజే భోసలే శివాజీ మహారాజ్ వారసులలో ఒకరు. ఆయన తండ్రి పేరు శ్రీ ప్రతాప్ సింగ్ మహారాజ్ భోసలే. ఉదయన్ రాజే భోసలే మహారాష్ట్రలోని సతారా జిల్లాలో నివసిస్తున్నారు. ఉదయన్ రాజే భోసలే ఒక భారతీయ రాజకీయ నాయకుడు. మహారాష్ట్రలోని సతారా స్థానం నుంచి బీజేపీ ఎంపీగా గెలుపొందారు. ఆయన దమయంతిరాజేను నవంబర్ 20, 2003న వివాహం చేసుకున్నారు. అతనికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు కోరారు.

తెలుగు నేలపై నడయాడిన మరాఠా యోధుడు మరాఠా సామ్రాజ్యాన్ని విస్తరించి, ధర్మ స్థాపన కోసం సామ్రాజ్యం స్థాపించిన గొప్ప యోధుడు ఛత్రపతి శివాజీ తెలుగు నేలపై నడయాడినట్లు తెలుస్తుంది. అయితే, పుణె, తుల్జాపూర్, పండరీపూర్ మీదుగా 1677 ఫిబ్రవరి నెలలో నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలో లోకాయపల్లి రాణి లక్ష్మమ్మ సంస్థానానికి వచ్చినట్లు సమాచారం. జైత్రయాత్ర పేరుతో వచ్చిన శివాజీ సైన్యంలోని కొందరిని ఇక్కడే వదిలి పెట్టి.. మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మీదుగా గొల్కొండకు వెళ్లారంటున్నారు. ఇక, శివాజీ వెంట సుశిక్షితుల్కైన 50 వేల మందితో కూడిన సైన్యం ఉండేది అని పేర్కొన్నారు. శివాజీ రాకకు గుర్తుగా హైదరాబాద్‌లోని పురానాపూల్ దగ్గర పెద్ద స్మారకాన్ని సైతం నిర్మించారు. అప్పట్లో మహామంత్రి మాదన్న నారాయణపేట ప్రాంతానికి వచ్చి శివాజీని స్వాగతిస్తూ ఆలింగనం చేసుకున్నారని అక్కడ నానుడి. శివాజీ నడుస్తుండగా ప్రజలు పూలవర్షం కురిపించారు. నెల రోజుల పాటు తెలంగాణలోనే ఉండి అనంతరం శ్రీశైలానికి ఆయన తిరిగి వెళ్లిపోయాడని లోకాయపల్లి సంస్థాన చరిత్రలో పేర్కొన్నారు.

**- సుగుణ శేఖర్ రెడ్డి గుమ్మళ్ల (ఫ్రీ లాన్స్ జర్నలిస్ట్)**

## చరిత్రలో ఈ రోజు (ఏప్రిల్ 3)

**సంఘటనలు:**

1984: మొదటి భారతీయ రోదశి యాత్రికుడు, రాకేశ్ శర్మ అంతరిక్షంలో ప్రయాణించాడు.

**జననాలు:**

1715: విలియం వాట్సన్, ఇంగ్లీషు భౌతిక శాస్త్రవేత్త.

1914: మానెక్‌షా, భారతదేశపు మొట్టమొదటి ఫీల్డ్ మార్షల్.

1917: పొందూరి వెంకట రమణారావు, మైక్రో బయాలజిస్టు.

1955: హరిహరన్, భారతదేశ గాయకుడు.

1961: ఎడీ మర్ఫీ, అమెరికన్ నటుడు, చిత్ర దర్శకుడు, నిర్మాత, గాయకుడు.

1962: జయప్రద, తెలుగు సినీనటి, పార్లమెంటు మాజీ సభ్యురాలు.

1973: నీలేష్ కులకర్ణి, భారత క్రికెట్ జట్టు మాజీ క్రీడాకారుడు .

1973: ప్రభు దేవా, భారతదేశ చలనచిత్ర నృత్యదర్శకుడు, నటుడు.

**మరణాలు:**

1680: ఛత్రపతి శివాజీ, మహారాష్ట్ర సామ్రాజ్య స్థాపకుడు.

1956: మరూరు లక్ష్మీనరసప్ప, కవి, రచయిత.

2010: భండారు సదాశివరావు, రచయిత, సంపాదకుడు, ఆర్.ఎస్.ఎస్. ప్రచారకుడు. పండుగలు.

# అభివృద్ధి పనులు ప్రారంభం



కె.కోటపాడు, (విశాఖ సమాచారమ్):- పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను మాడుగుల ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి బుధవారం ప్రారంభించారని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.ఎ.సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పాతవలస, దాలివలస, సింగందొరపాలెం, ఎ.కోడూరు గ్రామాల్లో కోటి 61లక్షల 65వేల రూపాయల ఖర్చుతో నిర్మించిన సిమెంట్ కాంక్రీట్ రోడ్లు, పశువులకు సామూహిక నీటితొట్టె, పశువుల షెడ్, రక్షిత మంచి నీటి పథకంను ఎమ్మెల్యే సత్యనారాయణ మూర్తి ప్రారంభించారని ఎంపీడీవో సాంబశివరావు తెలిపారు.

# ఎంపీడీవో ఆఫీసులో లోన్ల మేళా



తాళ్లపూడి, (విశాఖ సమాచారమ్):- తాళ్లపూడి మండల కేంద్రమైన ఎంపీడీవో ఆఫీసులో బీసీ ఓసీల లోన్ల సందడి వాతావరణం నెలకొంది.

ఎంపీడీవో టీబీవీ రమణ మరియు బ్యాంకు వారు లబ్ధిదారుల లోన్ల అర్హత పత్రాలను తనిఖీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ జొన్నకూటి పోసిరాజు, మరియు వెంకన్న లోన్లకు ఎవరు అర్హతదారులో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తెలియజేసారు. వచ్చిన లబ్ధిదారులందరు కూడా మేము ఈ లోన్ పెట్టడానికి మాకు ఈ అర్హత ఉందని లోన్లకు సంబంధించిన పత్రాలను అధికారులకు చూపించారు ఈ క్రమంలో మండల ఆఫీస్ మొత్తం సందడి వాతావరణంలో నెలకొంది.

# సామాజిక పింఛన్లు పంపిణీ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో) : పరవాడ మండలం వాడచీపురుపల్లి గ్రామంలో ఎన్.టి.ఆర్. భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా ప్రత్యేక అధికారి గిరీషా పి.ఎస్., జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేపట్టారు. మాసవరపు వీధిలో నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి దివ్యాంగురాలైన లాలం శ్రావణికి, వితంతువు గుండా సోమమ్మకు ఎన్టీఆర్ భరోసా వృద్ధాప్య పింఛనుతో పాటు అభయ హస్తం పింఛను అందించారు. లాలం సింహాచలంకు ఎన్.టి.ఆర్. భరోసా వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేశారు.ఎన్ టి ఆర్ భరోసా సామాజిక పింఛన్లు కింద వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు, కదలలేని స్థితిలో ఉన్నవారికి, కళాకారులకు తదితర అన్ని రంగాలకు చెందిన వాటికి కనీస పింఛను నాలుగు వేల రూపాయలు కాగా గరిష్ఠంగా పదిహేను వేల రూపాయలు అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఎ. ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శచిదేవి, పరవాడ మండలం ఎంపీడీఓ. కె.ధర్మారావు, తహసీల్దార్ అంబేద్కర్, పరవాడ మండలం జనసేన పార్టీ ఇన్‌చార్జి పంచాకర్ల ప్రసాద్, పరవాడ మండలం టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# Spoken English -16

Phone conversation @

A: Hey What's up! Just checking in. What you doing?- హే! ఏంటీ సంగతులు! ఊరికే అడుగుతున్నా నీవు ఏం చేస్తున్నావు?

B. Just finishing up things at school. I've got a paper due tomorrow, but, it's almost done. Maybe another hour.-- స్కూలు లో పనులు ఇప్పుడే అయ్యాయి. రేపటికి ఓ పేపర్ మిగిలివుంది. అయితే ఇది మొత్తానికి అయ్యింది.ఇంకొక గంటలో అవుతుంది.

A. Ah Cool. What's it about? I miss school.- అయితే కూల్. మరింకేటి? నేను స్కూలు మిస్ అయ్యాను.

B. Actually, its an economics paper about democracy.- నిజానికి ఇది ప్రజా స్వామ్యం గురించి వుండే ఎకనామిక్స్ పేపర్.

A. Ohhhh. That sounds brutal. haha.-: ఓ..చాలా కఠినంగా వుంటుంది. హ..హ..హో

B. Brutal but interesting. I don't mind it. So.. what you doing? - కఠినంగా వుంటాది గానీ ఇంట్రెస్టింగ్ గా వుంటుంది. నేను పట్టించుకోను. మరి నీవేంజేస్తున్నావ్?

A. Well. Just finished work, hitting up a dance class and then maybe dinner. Want to meet up? - మంచిది. ఇప్పుడే పని అయ్యింది.డాన్స్ క్లాస్ కు వెళ్తున్నాను. తర్వాత డిన్నర్ వుండొచ్చు. కలుద్దామా?

.B. Let's play it by ear - – చూద్దాం!..(గ్యారెంటీ లేదు)

A. Sure. I probably won't - go until later. 8 or 9-ish.- తప్పకుండా. 8-9 తర్వాత నేను నేను వెళ్ళిపోవచ్చును.

B. Sweet. That's great. Pizza and a pint? - స్వీట్? . చాలా బావుంటుంది. పిజ్జా లేదా పింట్( బీరు)?

A. Perfect. We can meet downtown.- అద్భుతం. మనం క్రింద కలుద్దాం.

B. Okay. See you soon.- ఓకే..త్వరలో కలుస్తాను.

B. Ciao.-- గుడ్ బై.

**By Dr.P.V.Ram, Visakhapatnam. 9553574250**
**(Visakha Samacharam)**

# భూ ఆక్రమణ స్థలంలో రెవెన్యూ బోర్డులు ఏర్పాటు

దేవరాపల్లి, (విశాఖ సమాచారమ్):- మండలంలోని గర్భింగి పంచాయతీ తాటిపూడి సమీపంలో భూ అక్రమణ జరినట్లు రెవెన్యూ అదికారులు గుర్తించి బోర్డులు పెట్టారు. దీంతో ఆక్రమణ దారుడు రెవెన్యూ అదికారులను బెదిరింపులకు పూనుకుంటూ బోర్డులు పీకేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు డి.వెంకన్న పేర్కొన్నారు.భూ అక్రమణ జరిగిన ప్రాంతాన్ని పరిశీంచిన అనంతరం వారు మాట్లాడారు.గర్భింగి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్లు (ఎల్ పి ఎం) 49 లో 11 సెంట్లు భూమి,78 లో 16 సెంట్లు 70, 69, 45 , భూమి, గెడ్డ వాగు ఆక్రమణకు గురైనట్లు అధికారులు రెవిన్యూ గణాంకాల్లో వెల్లడించారని తెలిపారు.అలాగే ఆ జిరాయితీ భూమికి అనుకొని ఉన్న మిగిలిన ప్రభుత్వ భూమి సర్వే నెంబర్లలో ఉన్న ప్రభుత్వ బంజరు,గెడ్డ, వాగు,పోరంబోకు, కొండ పోరంబోకు భూముల్లో ఇష్టాను సారంగా రాళ్లను, బండలను నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాలతో పేల్చేసి, ఆ భూస్వరూపాన్ని పూర్తిగా మార్చివేసారని ఆరోపించారు. ప్లాట్లుగా పోల్స్ నిర్మించి రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇష్టానుసారం వ్యవహరిస్తున్న తీరు ఈప్రాంతం లోని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుందని తెలిపారు. రెవెన్యూ అదికారులపై సైతం బెదిరింపులకు పూనుకోవడం దుర్మార్గ మన్నారు.కొనుగోలు చేసింది గోరంత అయితే, ఆక్రమించేసిందే కొండంతని తెలిపారు.మరో పక్క రియల్ ఎస్టేట్ వ్యాపారులతో అధికారులు కుమ్మక్కయ్యి బోర్డులు పెట్టెసి చేతులు దులుపు కున్నారని తెలిపారు. గెడ్డ వాగులను ఆక్రమిం చేసి పల్లె గిరిజన



వాతావరణం లో కొండలు, గెడ్డలు, వాగులు నుంచి పారే వర్షపు నీరుతో అందంగా కన బడే ప్రకృతి నాశనం చేసెసారని అందోళన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు దెబ్బకు గెడ్డలు పూర్తిగా అంతరించి పోతున్నాయని తెలిపారు పూర్వ కాలం నుంచి గెడ్డలు,కొండ వాగులు వాటిని అలాగే విడిచి పెట్టడం వలన క్రింది ప్రాంతంలో పంట పోలాలకు చేరువులకు సాగు నీరు అందుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఈప్రాంతాన్ని సందర్శించి ప్రభుత్వ భూములు అక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోని,ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని వెంకన్న డిమాండ్ చేశారు.

# నాటు సారా రహిత జిల్లాగా అనకాపల్లి

## కలెక్టర్ విజయ కృష్ణన్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో) : నాటుసారా రహిత జిల్లాగా అనకాపల్లిని తీర్చిదిద్దడమే నవోదయం 2.0 ప్రధానోద్దేశమని, ఆ దిశగా జిల్లాలో సమూలంగా నాటు సారాను నిర్మూలించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అద్వర్యంలో నాటుసారా నిర్మూలన కార్యక్రమం 'నవోదయం 2.0' పై పోలీస్, అటవీ, పంచాయతీ రాజ్, గిరిజన శాఖలతో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నాటుసారా రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా.. నాటుసారాను నిర్మూలించడానికి ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకొని ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. అనకాపల్లి జిల్లా చుట్టూ చాలా జిల్లాల సరిహద్దు ప్రాంతాలను కలిగి వుండడంతో ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీలు మరింత సూక్ష్మ దృష్టిని సారించాలన్నారు. నవోదయం 2.0 పై ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా క్షేత్రస్థాయి సిబ్బంది ఈ కార్యక్రమం సమర్థంగా అమలు చేయాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో కమిటీలను నియమించాలన్నారు నియమించ డంతోపాటు వారు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలను అవగాహన పరచాలన్నారు. నాటుసారా నిర్మూలనకు గ్రామస్థాయిలో కార్యాచరణ రూపొందించాలని సూచించారు, గ్రామాలు, పట్టణాలలో అవగాహన సదస్సులు, ముఖ్యంగా మహిళలతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నాటుసారా వినియోగం వల్ల కలిగే. ఆరోగ్య, సామాజిక, ఆర్థిక దుష్ప్రభావాలను వివరించాలని, నాటుసారా సేవించడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలన్నారు. రెండు నెలల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం అమలుపై అన్ని అనుబంధ శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఐడి లిక్కర్ (అక్రమ స్వేదన మద్యం) పీడిత గ్రామాల జాబితాను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించడం జరిగిందని, ఏ కేటగిరీలో 21 గ్రామాలు, బి కేటగిరిలో 45 గ్రామాలు, సి కేటగిరిలో 85 గ్రామాలను గుర్తించడం జరిగిందన్నారు, ఆయా గ్రామాల్లో నాటు సారాను నిర్మూలించి ప్రభుత్వ లక్ష్యం చేరుకునేలా పనిచేయాలన్నారు. మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకొని ఎమ్మార్వో అధ్యక్షతన నాటు సారా వల్ల దుష్ప్రభావాలపై సమావేశం నిర్వహించుకోవాలని తెలిపారు. నాటు సారా తయారీ, రవాణా విక్రయాలు కొనసాగించే వారిపై ఇక పై కఠిన చర్యలు ఉంటాయన్నారు. నేరం చేసిన వారికి 8 సంవత్సరాలు జైలు శిక్షతోపాటు రూ 5 లక్షల వరకు జరిమానా విధిస్తారన్నారు. జిల్లాలో ఎక్కడైనా నాటుసారా తయారుచేసినా, రవాణా చేసినా, నిల్వచేసినా, అమ్మకాలు జరిపినా 14405 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రధాన కూడలిలో నాటు సారా నిర్మూలన కార్యక్రమంపై విస్తృతంగా చిన్న సైజు హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ సూర్జిత్ సింగ్, జిల్లా ప్రొహిబిషన్,ఎక్సైజ్ అధికారి వి. సుధీర్, జిల్లా అటవీశాఖ అధికారి శామ్యూల్, జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్) మోహన్ రావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగ శిరీషా, ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్లు, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డైట్‌లో డేటా అనలిటిక్స్ పై నైపుణ్య సదస్సు

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ (ఆటానమస్)లో ఐసీటీ అకాడమీ, ఐబీఎం కలిసి నిర్వహించిన డేటా అనలిటిక్స్ నాలుగు రోజులు పాటు శిక్షణ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థులు డేటా అనలిటిక్స్, పిడిక్టివ్ మోడలింగ్, మెషీన్ లెర్నింగ్, డేటా విజువలైజేషన్ వంటి ఆధునిక నైపుణ్యాలను పొందారు, తద్వారా వారు ఆధునిక డేటా ఆధారిత ప్రపంచంలో అవసరమైన నైపుణ్యాలతో సిద్ధమవుతున్నారు. ఈ సమగ్ర శిక్షణ కార్యక్రమాన్ని ఐబీ ఎం ట్రైనర్ ప్రవీణ్ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఐబీఎం పైతాన్ వంటి పరిశ్రమ ప్రమాణాల సాధనాలను ఉపయోగించి ప్రాక్టికల్ అనుభవం కల్పించబడింది. కార్యక్రమం ద్వారా, విద్యార్థులు పెద్ద డేటా సెట్‌లను విశ్లేషించడం, ట్రెండ్స్‌ను కనుగొనడంతో పాటు డేటా ఆధారిత నిర్ణయాలను తీసుకోవడం నేర్చుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ 'ఈ మార్పు చేసే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన మా విద్యార్థులపై మాకు ఎంతో గర్వంగా ఉందని అన్నారు.

కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఈ శిక్షణ విద్యార్థుల వృత్తిపరమైన ప్రయాణంలో కొత్త అవకాశాలను




తెరవడంలో సహాయపడుతుందన్నారు. పరిశ్రమలో నైపుణ్యాలతో కూడిన డేటా అనలిటిక్స్ అవసరం పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.సుజాతతో పాటు విభాగాధిపతులు, అకడమిక్ కోఆర్డినేటర్ ఎ. కృష్ణ నాగ్, డీన్ అడ్మిన్ కె.ఈశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్. సీఎస్ఈ విభాగంలోని అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# కనుల పండువగా శ్రీనివాస కళ్యాణం నృత్య రూపకం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- అనకాపల్లి నూకాంబిక అమ్మవారి జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండగగా నిర్వహిస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నేతృత్వంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మంగళవారం రాత్రి శ్రీకాకుళానికి చెందిన శ్రీ సాయి నృత్య కళానికేతన్ విద్యార్థులు చేసిన కూచిపూడి నృత్యం ఆహుతులను అలరించింది. ఆర్వీఎల్ వాగ్దేవి శిక్షణలో చిన్నారులు చేసిన నృత్యాలు ప్రేక్షకులను అబ్బుర పరిచాయి. సుమారు గంటన్నర పాటు చిన్నారులు తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. చిన్నారులు లాస్య సంజనా చౌదరి హర్షిత మాన్య స్ఫూర్తి మాధుర్య తమ హావభావాలతో ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీనివాస కల్యాణం నృత్య సంగీత రూపకం సుమారు 20 నిమిషాలపాటు కనుల పండువగా సాగింది. కళాకారులను కార్యక్రమ నిర్వాహకులు స్థానిక దేవుని గుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్, అనకాపల్లి వాగ్గేయ వరదాయని సంస్థ వ్యవస్థాపకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి,



వేంకటేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ సకల గోవిందా, గవరపాలెం శ్రీ గౌరీ పరమేశ్వరి ఉత్సవ కమిటీ ప్రతినిధి గండేపల్లి మురళి సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, జగన్నాథ స్వామి ట్రస్ట్ బోర్డు చైర్మన్ వైభవ్ బుజ్జి, కాండ్రేగుల శ్రీరామ్, మద్దాల వంశీ సాయికుమార్, మద్దాల క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య, ఉద్యోగ సమాచారం

## కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలు




దేశవ్యాప్తంగా కేంద్రీయ విద్యాలయాల్లో ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రవేశాలకు సంబంధించి ప్రకటనను కేంద్రీయ విద్యాలయ సంఘటన్(కేవీఎస్) విడుదల చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, వాటి అనుబంధ సంస్థలు, రక్షణ రంగ సంస్థల్లో పనిచేస్తున్నవారి పిల్లలకు, తల్లిదండ్రులకు ఏకైక సంతానంగా ఉన్న బాలికలకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. అర్హత ఉన్న వారు తరగతులకు నిర్దేశించిన మేరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

**వివరాలు...**

కేంద్రీయ విద్యాలయాల్లో 1 నుంచి 12వ తరగతి వరకు ప్రవేశాలు

**సీట్ల రిజర్వేషన్:** ఎస్సీ అభ్యర్థులకు 15 శాతం, ఎస్టీ అభ్యర్థులకు 7.5 శాతం, ఓబీసీ అభ్యర్థులకు 27 శాతం, దివ్యాంగులకు 3 శాతం సీట్లు కేటాయించారు.

**వయస్సు ప్రమాణాలు:**

**వయసు:** ఒకటో తరగతిలో ప్రవేశం పొందాలంటే మార్చి 31 నాటికి విద్యార్థి వయసు ఆరు నుంచి ఎనిమిదేళ్ల మధ్య ఉండాలి. రెండో తరగతి ప్రవేశానికి ఏడు నుంచి తొమ్మిదేళ్ల మధ్య, మూడు, నాలుగో తరగతులకు 8-10, అయిదో తరగతికి 9-11, ఆరుకు 10-12, ఏడుకు 11-13, ఎనిమిదికి 12-14, తొమ్మిదికి 13-15, పదికి 14-16 ఏళ్ల మధ్య.. ఇలా ప్రతి తరగతికీ నిర్దేశించిన మేరకు వయసు ఉండాలి. రిజర్వుడ్ కేటగిరీ విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: ఒకటో తరగతి ప్రవేశాలు ఆన్‌లైన్ లాటరీ సిస్టమ్ ద్వారా, రెండు నుంచి ఎనిమిదో తరగతి వరకు ప్రవేశ పరీక్షలు ఉండవు. ప్రయారిటీ కేటగిరీ సిస్టం ప్రకారం సీటు కేటాయిస్తారు. సీట్ల సంఖ్య కంటే దరఖాస్తులు ఎక్కువగా వస్తే లాటరీ సిస్టం ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తారు. పదకొండో తరగతి ప్రవేశాలకు సంబంధించి పదోతరగతి మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. పదో తరగతిలో సీట్లు మిగిలితే ప్రవేశాలు నిర్వహిస్తారు.

**ముఖ్య తేదీలు...**

ఒకటో తరగతి ప్రవేశాల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ తేదీలు: మార్చి 1 నుంచి మార్చి 21 వరకు.

**ఒకటో తరగతి తొలి ప్రొవిజనల్ లిస్ట్ వెల్లడి:** మార్చి 25.

**రెండో ప్రొవిజనల్ జాబితా వెల్లడి:** ఏప్రిల్ 04

**మూడో ప్రొవిజనల్ జాబితా వెల్లడి:** ఏప్రిల్ 07.

**రెండు, ఆ పైతరగతుల్లో (11వ తరగతి మినహాయించి) ఖాళీగా ఉండే సీట్ల భర్తీ రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ:** జులై 31.

**బాలవాటిక-2, తరగతి 2 నుంచి 12 వరకు (11వ తరగతి మినహాయించి) రిజిస్ట్రేషన్ తేదీలు:** ఏప్రిల్ 2 నుంచి 11 వరకు అవకాశం

**బాలవాటిక, తరగతి 2 నుంచి 12 వరకు(11వ తరగతి మినహాయించి) తుది అడ్మిషన్ లిస్ట్:** ఏప్రిల్ 17


**అడ్మిషన్ల ప్రారంభం:** ఏప్రిల్ 18 నుంచి 21 వరకు

**11వ తరగతి మినహా మిగతా తరగతులన్నింటిలో అడ్మిషన్లకు తుది గడువు:** జూన్ 30.

**11వ తరగతి ప్రవేశాల రిజిస్ట్రేషన్:** కేవీ విద్యార్థులు 11వ తరగతి ప్రవేశాలకు రిజిస్ట్రేషన్లు పదో తరగతి ఫలితాలు వెల్లడైన తర్వాత పది రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. 20 రోజుల్లోపు ఎంపికైన వారి జాబితాను ప్రకటిస్తారు.

దరఖాస్తు విధానం: ఒకటో తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారాబీ రెండు ఆపై తరగతులకు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

## నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో టెక్నికల్ మేనేజర్ ఖాళీలు




ప్రభుత్వ రంగ సంస్థ.. నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఎస్ఆర్సీఎల్).. కాంట్రాక్ట్/ రెగ్యులర్ ప్రాతిపదికన 71 టెక్నికల్ మేనేజర్ పోస్టులను భర్తీ చేయనుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి.

**పోస్టుల వివరాలు: ఖాళీలు**

జూనియర్ టెక్నికల్ మేనేజర్ (సివిల్)- 35
జూనియర్ టెక్నికల్ మేనేజర్ (ఎలక్ట్రికల్)- 17
జూనియర్ టెక్నికల్ మేనేజర్ (ఎస్ఎన్‌టీ)- 3
జూనియర్ టెక్నికల్ మేనేజర్ (ఆర్ఎస్)- 4
అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్ (ఆర్కిటెక్చర్)- 08
అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్ (డెటాబేస్ అడ్మినిస్ట్రేటర్)- 01
అసిస్టెంట్ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్)- 01
అసిస్టెంట్ మేనేజర్ (జనరల్)- 02

**మొత్తం పోస్టుల సంఖ్య:** 71

**అర్హతలు:** 31.03.2025 నాటికి సంబంధిత విభాగాల్లో డిగ్రీ, బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

డీఎంహెచ్ఓ నెల్లూరులో ల్యాబ్ టెక్నీషియన్ ఖాళీలు

**వయసు:** 31.03.2025 నాటికి అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 35 ఏళ్లుబీ ఇతర పోస్టులకు 20 నుంచి 35 ఏళ్లు ఉండాలి.

**దరఖాస్తు ఫీజు:** రూ.400. ఎస్సీ/ ఎస్టీ/ మహిళలకు ఫీజు లేదు.

**వేతనం:** నెలకు అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.50,000-రూ.1,60,000బీ ఇతర పోస్టులకు రూ.40,000-1,40,000.

**ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల అనంతరం తుది ఎంపిక చేస్తారు.

**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

**దరఖాస్తుకు చివరి తేదీ:** 24.04.2025

# బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం




రాంబిల్లి, (విశాఖ సమాచారమ్):- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం పోరాటం చేస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కె.రామ సదాశివ రావు అన్నారు. బుధవారం నుంచి ఈ నెల ఆరో తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం మధురైలో జరుగుతున్న సీపీఎం 24వ అఖిల భారత మహాసభలు జయప్రదం కావాలని కోరుతూ హరిపాలెం గ్రామంలో ఆయన జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు కర్రి అప్పారావు, అచ్చుతాపురం కన్వీనర్ ఆర్. రాము మాట్లాడుతూ మూడేళ్లకు ఒకసారి జరిగే ఈ మహాసభలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై, నిరుద్యోగ సమస్య, రైతులు పంటలకు గిట్టుబాటు ధరలు, కార్మికులకు కనీస వేతనాలు, ధరలు పెరుగుదల, దళితులు, గిరిజనులు ,మహిళలు, మైనారిటీలపై జరుగుతున్న దాడులు, మతోన్మాద ప్రమాదం వంటి సమస్యలపై చర్చలు జరుగుతాయన్నారు. రాబోయే మూడు సంవత్సరాల్లో పోరాటాలను రూపొందించి పార్టీ బలోపేతానికి కార్యచరణ రూపొంది స్తారన్నారు. చివరి రోజున మధురైలో భారీ బహి రంగ సభ జరుగుతుందని, ఆ సభలో ప్రజ లందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో హరిపాలెం శాఖ కార్య దర్శి బి.రామ్ కుమార్ , సీనియర్ నాయకులు బుద్ధ రంగారావు, అచ్యుతాపురం మండల కమిటీ సభ్యులు కె.సోమునాయుడు, నాగేశ్వరరావు ,బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# రుణ దరఖాస్తులదారులకు ఇంటర్వ్యూలు రేపు



కె.కోటపాడు, (విశాఖ సమాచారమ్):- బీసీ, ఈబీసీ కార్యాచరణ ప్రణాళిక 2024-25 కింద సబ్సిడీతో కూడిన రుణాల కోసం గత నెల 10వ తేదీ నుంచి 25వరకు మండలంలో 32 గ్రామ పంచాయతీల వారీగా దరఖాస్తులు చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఈ నెల 4 వ తేదీన మండల ప్రజా పరిషత్ (ఎంపీడీవో)కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వ హించనున్నట్టు ఎంపీడీఓ ఎ.ఎ.సాంబశివ రావు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదార్లు తమ విద్యార్హతలు, సాంకేతిక అర్హతలు (ఉన్నచో) ఒరిజినల్ సర్టిఫికేట్లతో పాటు మూడు సెట్లతో వివిధ బ్యాంక్ మేనేజర్స్ నిర్వహించే ఇంటర్వ్యూ లకు హాజరు కావాలని అయన కోరారు. ఇంట ర్వ్యూలకు హాజరుకానివారి దరఖాస్తులు తిరస్కరిం చబడ తాయని తెలిపారు. దరఖాస్తు మూడుసెట్ల ను ఇప్పటికే ఎంపీడీఓ ఆఫీస్ లో సమర్పించిన వారు మూడుసెట్లను తీసుకురానక్కర్లేదన్నారు. శు క్రవారం ఉదయం 10.00 గంటలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కె.కోటపాడు, గోవాడ బ్రాంచ్ లవారు, మధ్యాహ్నం 2:00గంటలకు చౌడువాడ, కె.కోటపాడు, ఆనందపురం ఏపీజీవీబీ బ్రాంచ్లవారు, లంకవానిపాలెం ఇండియన్ బ్యాంక్ వారు సదరు బ్యాంక్ బ్రాంచ్ నందు సేవింగ్స్ అకౌంట్స్ కల్గిన దరఖాస్తుదార్లందరికీ ఇంటర్వ్యూలు నిరహించనున్నట్టు ఎంపీడీఓ సాంబశివరావు ఆ ప్రకటనలో తెలిపారు.

# పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

## జిల్లా ప్రత్యేక అధికారి గిరీషా పి.ఎస్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో) : పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరమవు తాయని జిల్లా ప్రత్యేక అధికారి గిరీషా పి.ఎస్. తెలిపారు. మంగళవారం పరవాడ మండలం వాడ చీపురుపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌తో కలసి ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు అనంతరం ఇంటింటికి చెత్త బుట్టలు పంపిణీ చేశారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం పూర్తిగా మానివేయాలని, కాలువలలో చెత్తను వేయవద్దని, ఇంటిలో చెత్తను వేరుచేసి తడిచెత్తను ఎప్పటికప్పుడు పంచాయతి సిబ్బందికి అందించాలని, పొడి చెత్తను వారానికి ఒకసారి పంచాయతీ సిబ్బందికి అందించాలని తెలిపారు. కార్యక్రమంలో డి ఆర్ డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శచి దేవి, పరవాడ మండలం ఎంపీడీవో కె.ధర్మారావు, తహసీల్దార్ అంబేడ్కర్, పరవాడ మండలం జనసేన పార్టీ ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, మండలం టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజీకి తావులేకుండా కరకచెట్టు పోలమాంబ ఉత్సవాలు

## -ఆదర్శనగర్ ఆలయ కమిటీకి డాక్టర్ కంచర్ల ఆర్థిక భరోసా



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- కరకచెట్టు పోలమాంబ ఉత్సవాలు రాజీకి తావులేకుండా నిర్వహించాలని ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కంచర్ల వర్కింగ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు, ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ అధినేత, విశాఖ విద్యాదాత, ప్రముఖ సంఘసేవకుడు డాక్టర్ కంచర్ల అచ్యుతరావు విశాఖలోని పెదవాల్తేరు ఆదర్శ్ నగర్ యూత్‌కు ఆర్థిక భరోసా ఇచ్చారు. ఈమేరకు అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ఆహ్వాన పత్రికను నిర్వాహకులు డాక్టర్ కంచర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరకచెట్లు పోలమాంబ అమ్మవారి ఉత్సవాలు ఏటా మాదిరిగానే పెద్ద ఎత్తు నిర్వహించాలని, దానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ, ఈనెల 14న తొలేళ్లు ,, 15న అమ్మవారి ఊరేగింపు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులు డాక్టర్ కంచర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజర్ సుధీర్, ప్రతినిధులు నాగు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# "రేపు పొలిటిక్స్ విభాగంలో జాతీయ సదస్సు




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- ఆంధ్రా యూని వర్సిటీ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో రేపు అనగా ఏప్రిల్ 4 న ఏయూ ప్లాటినమ్ జూబ్లీ గెస్ట్ హౌస్, సెమినార్ హాల్ -2 నందు ఏప్రిల్ 4 న ఉదయం 9 గంటలకు "ప్రజాస్వామ్యం,భిన్నత్వం - భారత్, ఐరోపాలో మార్పు" అనే అంశంపై ఒకరోజు జాతీయ సదస్సు జరుగుతున్నదని విభాగం అధ్యక్షుడు , సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్.పేటేటి ప్రేమానందం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశానికి ఏయూ ఉప కులపతి ప్రొఫెసర్.జీపీ రాజశేఖర్ అధ్యక్షత వహిస్తారనీ ,. సెంటర్ ఫర్ యూరోపియన్ స్టడీస్, జేఎన్, యూ, న్యూఢిల్లీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షీతల్ శర్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని ,విశిష్ట అతిథిగా మాజీ వీసీ ప్రొఫెసర్.ఏ.రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రొ.ఏ.నరసింహారావు హాజరౌతున్నట్లు తెలియజేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్.కె.రవి కీలకోపన్యాసం ఇవ్వనున్నారు.

రీజనల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ టి.అనిల్ కుమార్, ఇతర ప్రతినిధులు , స్కాలర్స్, విద్యార్థులు సదస్సుకు హాజరవుతున్నట్లు సదస్సు డైరెక్టర్ ప్రొ. పేటేటి ప్రేమానందం , కో- కన్వీనర్లు డాక్టర్ షేక్ సులేమాన్, డా.టీ.నాగరాజులు తెలియజేశారు.

# 'ఉపాధి' బకాయిలు తక్షణమే చెల్లించాలి



దేవరాపల్లి, (విశాఖ సమాచారమ్):- జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.52 కోట్లు ఉపాధి హామీ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కాశిపురం ముసిడి పల్లి గ్రామాల్లో ఉపాధి కూలీలతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడారు ఏప్రిల్ 1 నాటికి జిల్లా వ్యాప్తంగా దాదాపుగా రూ.52 కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. మండు టెండలో పని చేస్తున్న కూలీలకు కనీసం టెంట్ సౌకర్యం కూడా కల్పించలేని నిస్సహాయిత స్థితిలో ప్రభుత్వ ఉందన్నారు. గతంలో తట్టా గునపాపం పార మంచి నీళ్ళు, ట్రావెలింగ్, సమ్మర్ అలవెన్సులు ఇచ్చే వారని అవి పూర్తిగా రద్దు చేసి రూ.7 పెంచినట్లు ప్రకటించడం అన్యాయమన్నారు.కార్యక్రమంలో ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సంక్షేమ బోర్డు అమలు చేయకుంటే సమ్మెకు సిద్ధం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ను నెల రోజుల్లో పరిష్కరించాలని లేకుంటే మే 20న సమ్మె చేపడతామని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ తెలిపారు. మండలంలోని మూలపేట గ్రామంలో జరిగిన భవన నిర్మాణకార్మికుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ కార్మికులు పెండింగ్ లో ఉన్న 46 వేల క్లైముల నిధులు మంజూరు చేయాలని, 55 సంవత్సరములు నిండిన ప్రతి కార్మికుడికి రూ.6,000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిన్ని చిన్న, గణేష్, తోట సత్తిబాబు, గులివిందుల రాము నాయుడు, పల్ల నర్సింగ రావు, ఉప్పిలి ఆదినారాయణ, బర్నకాన సత్తిబాబు పాల్గొన్నారు

# చందనోత్సవానికి హోంమంత్రికి ఆహ్వానం



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- సింహాచలం క్షేత్రంలో ఈ నెల 8న జరిగే వార్షిక తిరు కల్యాణోత్సవం, 30న జరిగే అప్పన్న స్వామి నిజరూప దర్శనం చందనోత్స వాలకు హాజరు కావాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితని ఆలయ ఈవో కొమ్ముల సుబ్బారావు ఆహ్వానించారు. బుధవారం విజయవాడలోని హోంమంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి ఆమెకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అప్పన్నస్వామి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను ఆలయ ఈవో హోంమంత్రికి అందజేశారు.

# ఘనంగా వరాహ లక్ష్మీ నరసింహ స్వామి రాట మహోత్సవం

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- పట్టణంలోని గవరపాలెం. దిబ్బ వీధిలో వెలసిన వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈనెల 8వ తేదీన జరగబోయే స్వామివారి తిరు కల్యాణ మహోత్సవం రాట ముహూర్తం కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అచ్యుత దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి తిరు కల్యాణం ఈనెల 8వ తేదీన, 30వ తేదీన స్వామివారి చందనోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహకులు మళ్ళ రామచంద్రరావు శ్రీ దాడి రత్నాకర్ తెలియజేశారు. అనంతరం స్వామివారి కరపత్రాలను రత్నాకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామచంద్ర రావు రత్నాకర్ దంపతులను సత్కరించారు.

# మత్స్యకార ప్రమాద భీమా పాలసీ రూ.30లక్షలకు పెంచాలి

## రాష్ట్ర ఫిష్ కాన్ డిమాండ్

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- మన రాష్ట్రంలో ప్రతి సంవత్సరం వంద నుంచి నూట యాభై మంది యువ మత్స్యకార్మికులు వేట చేసే క్రమములో చనిపోతున్నారని ఫిష్ కాన్ రాష్ట్ర అధ్యక్షుడు సూరాడ రాజారావు, ప్రధాన కార్యదర్శి కదిరి పోలరాజు డైరక్టర్ అర్జిల్లి దాసు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్ కార్మికులుగా వివిధ కంపెనీలల్లో పని చేస్తున్న విషయం మన అందరికీ తెలుసునని, వారు ప్రమాదవశాత్తు కంపెనీలలో మరణిస్తే 40 నుండి 50 లక్షలు ఇస్తున్నారని చెప్పారు.నైపుణ్యత (స్కిల్) కలిగి అత్యంత ప్రమాదకర వృత్తిలో సముద్ర వేట అని ఐక్య రాజ్య సమితికి చెందిన అంతర్జాతీయ కార్మిక సంస్థ గుర్తించిందని మత్స్యకారుడు సముద్రములో ప్రమాద వశాత్తు మరణస్తే ప్రభుత్వాలు రూ.5 నుండి 10 లక్షలు చెల్లించి చేతులు దులుపుకుంటున్నాయని విమర్శించారు. మత్స్యకారులకు ఎలాంటి సామాజిక భద్రత పథకాలు లేవని, ఉన్నది ఒక్క పెన్షన్ తప్ప, అదికూడా అర్హత కలిగి ఉన్నా, అతి తక్కువ మంది మత్స్యకారులకు మాత్రమే అందుతుందని అన్నారు.కనుక ప్రభుత్వాలు తక్షణమే ఒకొక్క మత్స్యకారుడుకి 30 లక్షల రూపాయల వరకు ప్రమాద భీమా పాలసీ మరియు సహజ మరణం పొందితే 20 లక్షల రూపాయలు, ఫిషింగ్ వృత్తి నుండి రిటైర్మెంట్ అయ్యితే, 20 లక్షలతో పాటు నెల వారి పెన్షన్ సౌకర్యం కల్పించాలనీ డిమాండ్ చేశారు.

# చేపల వేటకు వెళ్లి.. చెరువులో శవంగా మారి..





విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- చెరువుకు వెళ్లి చేపలు పట్టుకుని వస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి శవమై కనిపించిన సంఘటన భీమిలి బీచ్‌రోడ్డులో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి రెడ్డిల పాలేనికి చెందిన ఎరుసు సంతోష్ (35) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఖాళీ సమయంలో సమీపంలో చెరువుకు వెళ్లి చేపలు పట్టడం ఆయనకు అలవాటు. ఆయనకు నర్సిబాయ్ అనే మహిళతో వివాహం అయింది. పూజిత అనే కుమార్తె ఉంది. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో ఆమె కుమార్తెతో వేరొక చోట ఉంటోంది. కాగా.. ఉగాది రోజు తల్లిదండ్రులతో కలిసి సంతోషంగా గడిపాడు. అదే రోజు సాయంత్రం చెరువుకు వెళ్లి చేపలు పట్టుకుని వస్తానని చెప్పి బయలుదేరాడు. అయితే ఆ రోజు ఇంటికి రాలేదు. స్నేహితులతో కలిసి ఎక్కడికైనా వెళ్లి ఉంటాడని తల్లిదండ్రులు భావించారు. సోమవారం కూడా ఇంటికి రాకపోవడంతో అతని తండ్రి అప్పలరాజు కుటుంబ సభ్యులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. కాపులుప్పాడలోని చెరువులను పరిశీలించగా... ఆచూకీ లభ్యం కాలేదు. చేపలుప్పాడ కంబాల చెరువు ఒడ్డున సంతోష్ శవమై కనిపిం చాడు. వెంటనే అప్పలరాజు తమ బంధువులు, పోలీసు లకు సమాచారం అందించారు.

**మృతిపై అనుమానాలెన్నో..**

సంతోష్ ఇంటి నుంచి బయటకు వెళ్లి మృతి చెందడంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. అతను నీటిలో మునిగి చనిపోయాడని అనుకుంటే చెరువులో పూర్తి స్థాయిలో నీరు లేదు. పోనీ ఊబిలో చిక్కుకున్నాడని అనుకుంటే ఆయన మృతదేహం ఒడ్డున పడి ఉంది. సంతోష్ చేతులు, ముఖంపై తీవ్ర గాయాలున్నాయి. కాగా.. తన కుమారుడిని ఎవరో హత్య చేసి ఉంటారని సంతోష్ తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భీమిలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భీమిలి మార్చురీకి తరలించారు.

# నూకాలమ్మకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక పూజలు





గొలుగొండ, (విశాఖ సమాచారమ్):- నూకాలమ్మ తల్లి అమ్మవారి కొత్త అమా వాస్య జాతర సందర్భంగా 9 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు అమ్మవారి దర్శనం చేసుకు న్నారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ వరలక్ష్మి, గ్రామ మహిళలు సభాపతి అయ్యన్న పాత్రుడు దంపతులకు ఘన స్వాగతం పలికారు. పురోహితులు వేదమంత్రాలతో పూర్ణకుంభంతో ఆహ్వానించారు. అయ్యన్న పాత్రుడు దంపతులు అమ్మవారికి పట్టుచీర, పసుపు, కుంకుమ సమర్పించి, కుంకుమ పూజతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం ఆలయ పరిసరంలోని దుకాణాలను సందర్శించి, వ్యాపారుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు వారి దగ్గర వున్న వస్తువులు కొని వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో దివ్య జ్యోతి, గొలుగొండ మండల పార్టీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు చిటికెల సాంబమూర్తి, చిటికెల తారక వేణుగోపాల్, చోద్యం సర్పంచ్ అదపురెడ్డి గోపాలకృష్ణ, మండలంలోని పలు గ్రామాల పార్టీ ప్రెసిడెంట్లు, నాయకులు పాల్గొన్నారు.

# ఇంటర్ కాలేజ్ పోటీల్లో గాయత్రి విద్యా పరిషత్ విద్యార్థుల ప్రతిభ



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- సమతా కళాశాలలో నిర్వహించిన ఇంటర్ కాలేజ్ ఫిజిక్స్ క్విజ్‌లో గాయత్రి విద్యా పరిషత్ కళాశాల విద్యా ర్థులు ఎం. సత్య మనోహర్ ఫిజిక్స్ (మేజర్), మొదటి సంవత్సరం, కె.హరిహరన్ రఘు సాయి జయంత్ కంప్యూటర్ (మేజర్) మొదటి సంవత్సరం, కె.అభినాష్, కంప్యూటర్ (మేజర్) మొదటి సంవత్సరం, ఓ.లక్ష్మణ్ రవికుమార్, ఫిజిక్స్ (మేజర్) రెండో సంవత్సరం,అగ్రస్థానాన్ని సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.ఎస్.బోస్, యూజీ కోర్సుల నిర్దే శకులు డి.గిరిధర్ హర్షం వ్యక్తం చేస్తూ విజేతలకు అభినందనలు తెలియచేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

# వ్యవసాయానుబంధ రంగాల్లో 15 శాతం వృద్ధే ధ్యేయం



## కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్

పాడేరు/జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- వ్యవ సాయానుబంధ రంగాల్లో 15 శాతం వృద్ధే ధ్యేయంగా పనిచేయాలని కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. అన్ని రంగాల్లో జిల్లాలో ఉద్పాదకత పెరగాలన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, వ్యవసాయ, మత్స్యశాఖ, ఉద్యానవన శాఖ, మైక్రో ఇరిగేషన్, ఫుడ్ సేఫ్టీ, పశు సంవర్థక శాఖ, ఎంపీడీవోలు , సెరీకల్చర్, ఎస్ఎంఐ గ్రామీణ నీటి సరఫరా విభాగం, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సేంద్రియ వ్యసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలో 104 చెక్ డ్యాంలకు మరమ్మతులు చేపట్టామన్నారు. 5,500 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కాఫీ విస్తరణకు ముఖ్య మంత్రి ఆదేశించారు. రానున్న మూడేళ్లలో సేంద్రియ వ్యవసాయ విస్తరణకు కార్య చరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రిజర్వాయర్లలో మత్స్య సంపద పెంచడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజా ప్రతినిధుల సమక్షంలో మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేయాలని చెప్పారు. మత్స్యకారుల సొసైటీలను ఆడిట్ చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. 5 వేల ఎకరాల్లో సామలు, రాగులు పెంపకం చేపడుతున్నామన్నారు. ఈ ఏడాది 33 వేల ఎకరాలలో కాఫీ తోటల పెంపకానికి నీడ తోటలు వేయాలన్నారు. 17,170 ఎకరాలలో ఉద్యానవన తోటలు, పండ్ల తోటలు, కూరగాయలు సాగు చేయడానికి తగిన చర్యలు చేపట్టాలని చెప్పారు. రంపచోడవరం డివిజన్ లో జీడిమామిడి, ఆయిల్ ఫామ్ తోటలు వేయాలన్నారు. 15 శాతం వృద్ధి సాధించడానికి ఏప్రిల్ 15 వ తేదీన వర్కుషాపు నిర్వహించాలన్నారు. 2 వేల ఎకరాల్లో డ్రిప్ ఇరిగేషన్ చేయాలన్నారు. డ్రిప్ ఇరిగేషన్ ప్రక్రియ అన్ని మండలాల్లో చేపట్టాలన్నారు. ఆర్గానిక్ సేద్యం చేస్తున్న ఎఫ్‌పి ఓలకు ప్రభుత్వ ప్రోత్సహకాలు, రాయితీలు అందించాలని చెప్పారు. జిల్లాలో మల్బరీ సాగు విస్తరించాలని చెప్పారు. రైతులకు కాఫీ, మిరియాలకంటే మల్బరీ సాగులో అధిక ఆదాయం వస్తుందన్నారు. ఈ ఏడాది పాడేరు, రంపచోడవరం డివిజన్లలో రెండు వందల ఎకరాల్లో మల్బరీ సాగు విస్తరించాలని చెప్పారు. కూనవరం240, చింతూరు 160 ఎకరాల్లో టస్సార్ సాగు చేస్తున్నారని మరో 400 ఎకరాలల్లో టస్సార్ సాగును విస్తరించాలన్నారు. ఐటీడీఏ పరిధిలో పశు సంపద యూనిట్లు లబ్ధిదారులకు అందించడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో రూ.20 కోట్లతో చెక్ డ్యాం మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు. చెక్ డ్యాం నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి రైతులకు సాగునీరందించాలన్నారు.

7 వేల ఎకరా లకు సాగునీరందించే బాధ్యత అధికారుల పైనే ఉందన్నారు. ఆశ్రమ పాఠశాలలకు కాలం చెల్లిన ఆహార పదార్థాలు సరఫరా చేస్తే సరఫరా దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మోద కొండమ్మ జాతరలో హొటళ్లు తనిఖీ చేయాలని సూచించారు. వేసవి కార్యచరరణ ప్రణాళిక సమర్ధవంతంగా అమలు చేయాలన్నారు. తాగునీటి సమస్యలు ఏర్పడకుండా తగిన చర్యలు చేపట్టాలని, తాగునీటి వనరులు, చేతి పంపులు మరమ్మతులు చేపట్టాలన్నారు. సమావేశంలో వర్చువల్‌గా పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు, డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, కట్టా సింహాచలం, అపూర్వ భరత్, ఎంపీడీవోలు, ప్రత్యక్షంగా జిల్లా వ్యవయాధికారి ఎస్.బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్ కుమార్ రావు, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ సీహెచ్ నరసింహులు, జిల్లా సెరీకల్చర్ అధికారి అప్పారావు, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, ఎస్ఎంఐ డీఈ నాగేశ్వరరావు,సీపీవో, ఎస్ ఎస్ ఆర్ కె.పట్నాయక్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ జవహార్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో ప్రమాదంలో క్షతగాత్రులకు అంబులెన్స్ ఏర్పాటు



అరకులోయ, (విశాఖ సమాచారమ్):- అనంతగిరి ఘాట్ రోడ్‌లోని దమకు-టైడ మార్గమధ్యలో ఆటో అదుపుతప్పి కొండను ఢీ కొట్టిన ఘటనలో గాయపడ్డ క్షతగాత్రులకు అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి వారిని ఆసుపత్రికి తరలించారు. అరకులోయ మండలం పద్మాపురం పంచాయతీ దుమ్మగూడ గ్రామానికి చెందిన సోమెల రొయల అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెను ఆటోలో ఆసుపత్రికి తరలిస్తుండగా టైడా సమీపంలో ఆటో అదుపుతప్పి కొండను ఢీకొంది. ఈ ప్రమాదంలో రొయల భర్త సోమల రంగారావు తలకు తీవ్ర గాయం అవ్వడంతో పాటు కుడి చేయి విరిగిపోయింది. అదేవిధంగా రొయలకు వారితో పాటు ఉన్న దొన అనే మహిళ తీవ్ర గాయాల పాలయ్యారు. అదే సమయంలో అటుగా వెళుతున్న అనంతగిరి ఎంపీపీ లిశెట్టి నీలవేణిలి వైఎస్ఆర్సీపి మండల అధ్యక్షుడు లికొర్రా సూర్యనారాయణలి క్షతగాత్రులకు సపర్యలు చేసి 108 అందుబాటులో లేకపోవడంతో అనంతగిరి పిహెచ్సి వైద్యాధికారిని జ్ఞానేశ్వరి తో మాట్లాడి పిహెచ్సి అంబులెన్స్ ను ఏర్పాటు చేసి క్షతగాత్రులను ఎస్.కోట సిహెచ్ సి తరలించారు. విషయం తెలుసుకున్న అనంతగిరి ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వచ్చి క్షతగాత్రులను పంపేందుకు సహకరించారు.

### పెట్రోల్ బంకు ముందు ఉన్న

# వ్యాన్ తొలగించరూ..



జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- జి.మాడుగుల గిరిజన సహకార సంస్థ పెట్రోల్ బంకు ముందు రెండు నెలలుగా వ్యాన్ నిలుపుదల చేయడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పెట్రోల్ బంకు యాజమాన్యం, పోలీస్ శాఖ సిబ్బంది స్పందించి ఆ వాహనాన్ని తొలగించాలని

# మారుమూల ప్రాంతాలకూ బస్సు సౌకర్యం

## సివేరి దొన్ను దొర



జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- విజయనగరం డివిజన్ పరిధిలోని అన్ని మారుమూల గ్రామాల ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని విజయరం ఆర్టీసీ జోన్ చైర్మన్ సివేరి దొన్ను దొర అన్నారు. ఆయన ఇక్కడ తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎంపీపీ లోంబోరి అప్పలరాజును శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అప్పలరాజు మండలంలోని వంతల గేమిలి గడుతురు సోలభం. లువ్వా సింగి సొంగులయ అలాగే మద్ది గరువు నుంచి పెదబయలు మధ్య బస్సు సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. దీంతో ఆయన ఈ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు సోమేలి చిట్టిబాబు, పార్టీ అధ్యక్షుడు వంతల కొండాల రావు, కృష్ణమూర్తి నాయుడు, తమ్మబ గంటం దొర, బి.బాబూరావు, కె.భీమ్‌బాబు, పాటి భీమ్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు గేమిలి అప్పారావు, కె.ఈశ్వరరావుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ప్రధానం

## పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి దాడి రత్నాకర్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- పట్టణంలోని 80 వార్డు పరిధిలో గల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం ప్రతి బుధవారం కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించడం జరుగుతుందని దాని ప్రకారమే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి దాడి రత్నాకర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దాడి రత్నాకర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ముఖ్యమని వారి శ్రేయస్సు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సభ్యత్వం తీసుకున్న ముఖ్య కార్యకర్తకు ఐదు లక్షల రూపాయలు ప్రమాద బీమా చేయించడం జరిగిందని అన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ సాధికారత సారధులను ఏర్పాటు చేయనుందని తెలియజేశారు. కార్యక్రమంలో దాడి జైవీర్, కొణతాల నీలిమ భాస్కర్, కొణతాల సత్యనారాయణ, కర్రి దివాకర్, టీడీపీ 80వ వార్డు ప్రెసిడెంట్ కాండ్రేగుల రాజారావు (రాజు) టీడీపీ 80వ వార్డు సెక్రటరీ విల్లూరి అప్పలనాయుడు, మల్ల రాజా. కొణతాల రాజేంద్ర, బొడ్డపాటి రాజారావు,వల్లూరు మాజీ సర్పంచ్ ఎర్ర సత్యనారాయణ, రాజుపాలెం గొల్లవెల్లి రామకృష్ణ ప్రసాద్ (బుజ్జి). గొల్లవెల్లి రవి, కసుమ రెడ్డి గోవింద, పెంటకోట చిన్న, విల్లూరి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# హౌసింగ్ ఎల్పీసీల కోసం వినతి



నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):- రాజయ్యపేట గ్రామ పంచాయతీ పరిధిలో మూడో వ వంతు గ్రామం ఫారెస్ట్ ల్యాండ్ ఉందని ఇళ్ల నిర్మాణం కోసం వీఆర్వో ఎల్పీసీలు ఇవ్వక పోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ అన్నరు. ఈ మేరకు బుధవారం ఆయన ఆధ్వర్యంలో నక్కపల్లి మండలం తహసీల్దార్ ఎన్. నరసింహమూర్తికి ఎలీసీలు ఇప్పించవలసిందిగా వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పిక్కి సత్తియ్య, టీడీపీ సీనియర్ నాయకుడు పిక్కి రాంబాబు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు పిక్కి గంగరాజు, మాజీ వైస్ ప్రెసిడెంట్ సిరిపల్లి అప్పలరాజు, యజ్జల బంగారి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి కృషి

## సర్పంచ్ వెంకటేశ్వరరావు



నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):- గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని సర్పంచ్ పొడగట్ల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ బచ్చల రాజు అన్నారు.నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామంలో బీసీ, ఎస్సీ వీధుల్లో సుమారు రూ.5 లక్షల ఎంపీటీసీ నిధులుతో సీసీ డ్రైనేజీల నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరావు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేశామని. అలాగే ప్రతి వీధిలో సీసీ రోడ్లు మరమ్మతులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, వైస్ ప్రెసిడెంట్ పొడగట్ల సన్యాసిరావు, ఎక్స్ వైస్ ప్రెసిడెంట్ బొల్లం రమణ, నీటి సంఘం అధ్యక్షుడు ఎరుబంది సూరిబాబు, గ్రామ వైఎస్ ఆర్సిపి అధ్యక్షుడు బచ్చల దొరబాబు, ధోని గోపి, పొడగట్ల సూరిబాబు, పొడపుట్ల సూర్య ప్రకాష్,వీరపురెడ్డి, రమేష్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి బాగోతం

## ముడుపు ముట్టనిదే ముందుకు కదలని ఫైళ్లు!

రావికమతం, (విశాఖ సమాచారమ్):- రావికమతం తహసీల్దార్ కార్యాలయం అవినీతి మయంగా మారిందనే ప్రచారం జోరుగా సాగుతోంది.దిగువ స్థాయి సిబ్బందికి ముడుపులు చెల్లిస్తేనే తప్ప ఒక్క ఫైలు కూడా ముందుకి సాగని పరిస్థితి నెలకొందనే వాదన వినబడుతోంది. క్రింద స్థాయి అధికారులు అందరూ పలు రకాల ఫైల్ తయారుచేసి పై అధికారి వరకు పంపించిన తర్వాత ఫైల్ అన్ని అక్కడే పెండింగ్ అవుతూ వస్తున్నాయి. ఈయన కను సన్నల్లోనే అంతా జరుగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అధికారి పైన పలు ఆరోపణలు నాలుగేళ్ల నుంచి వినిపిస్తున్నాయి. ముడుపులు ఇస్తే ఎటువంటి ఆధారాలు, కాగితాలతో సంబంధం లేకుండా మొత్తం పని జరిగిపోతుంది. పైసలు ఇవ్వకపోతే రకరకాల కారణాలు వెతుక్కుంటూ అది లేదు, ఇది లేదు,అని చెప్పి ఫైల్ ను రిజెక్ట్ చేసినటువంటి పరిస్థితులు నెలకొంటున్నాయని అంటున్నారు. ఈ ఒక్క వ్యక్తి ద్వారానే మండలంలో గల రైతాంగం ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైసలు చెల్లిస్తే ఈ వ్యక్తి వలన మండలంలో గల భూములు ఒకరి పేరువి మరొకరి పేరుకి తారు మారు నిమిషాలు పైన జరిగి పోతుంది. మండలంలో అనేకమంది రైతుల మధ్య భూ సమస్యలపై చిచ్చులు పెట్టడం వలన స్టేషన్ల చుట్టూ , కోర్టులు చుట్టూ తిరిగినటువంటి పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ వ్యక్తి వల్లనే కవ్వగుంట రీ సర్వే భూములన్నీ తారుమారు జరిగాయి. నేటికీ డబ్బులు ఇచ్చి తప్పులు చేయించుకున్న వ్యక్తికే అండగా నిలుస్తున్నారు అని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేసిన తప్పంతా కప్పుకోవడానికి ఈయనే మరొక వ్యక్తిని బలి పశువుని చేశారు. మండలంలో పక్కాగా ఉన్న రికార్డులన్నీ ఈ వ్యక్తి వల్లనే ట్యాంపరింగ్ జరిగిపోతున్నాయని పలువురు అనుమానిస్తున్నారు. ఈయన వద్దకు పైసలతో వచ్చిన ఫైళ్ళని సపరేట్గా ఒక అంమరాలు పెట్టుకొని రాత్రిపూట ఎక్కువగా పని జరిపిస్తుంటారు. ఈయన వల్లేనే పనులు ముందుకు సాగటం లేదని, రైతుల సమస్యలను కూడా పూర్తిస్థాయిలో పరిష్కారం చేయలేకపోతున్నామని, అదే కార్యాలయంలో పనిచేస్తున్న పలువురి ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఆ వ్యక్తిని ఈ కార్యాలయం నుంచి తొలగించినట్లయితే మండలంలో పనులు సజావుగా జరుగుతాయని పలువురు భావిస్తున్నారు.

# ప్లాస్టిక్ వాడకం నిర్మూలనకు కృషి



కొయ్యూరు, (విశాఖ సమాచారమ్):- ప్లాస్టిక్ వాడటం వల్ల, క్యాన్సరు తదితర భయంకర రోగాలు దరిచేరే అవకాశం ఉన్నదని నిపుణులు చెబుతున్నప్పటికీ ప్లాస్టిక్ ని జీవితంలో భాగం చేసుకోవడం దురదృష్టకరమని చివాలయ వీఆర్వో సత్యనారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజబాబులు అన్నారు. ఇప్పటికైనా కలిసికట్టుగా అందరూ ప్లాస్టిక్ నిషేధించాలని కోరారు. బుధవారం రాజేంద్రపాలెం గ్రామంలో ప్రతి దుకాణం వద్దకు వెళ్లి ప్లాస్టిక్ ని నిషేధించినందున ప్లాస్టిక్ కవర్లలో సామాన్లు వేసి ఇవ్వద్దని ఇకపై చేస్తే దుకాణ యజమానులకు నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన ఎమ్మెల్సీలకు సన్మానం



అనపర్తి, (విశాఖ సమాచారమ్):- వెలగపూడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ మోసేన్ రాజు ఛాంబర్‌లో నూతనంగా ఎమ్మెల్సీలుగా ఎన్నికైన కె.నాగేంద్రరావు(నాగబాబు), బీటీనాయుడు, సోము వీర్రాజులను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఘనంగా సత్కరించారు. బుధవారం నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలను కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన్న రాజప్ప, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, మాచర్ల ఎమ్మెల్యే జోల కంటి బ్రహ్మానందరెడ్డి, అనపర్తి నియోజకవర్గం జనసేన ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనువాసరావు,మాజీ ఎమ్మెల్సీ ద్వారపు రామారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్ దక్కేనా?

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో సత్తా చాటిన విశాఖ.. ఈ సారి ఎలాంటి ర్యాంకు సాధిస్తుందనే ప్రశ్న సర్వత్రా వినిపిస్తోంది. చంద్రబాబు హయాం(2018-19)లో 23వ స్థానానికి పరిమితమైన విశాఖ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో గణనీయమైన ప్రగతిని కనబరిచింది. 2023 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో టాప్-4లో నిలిచి దేశానికే ఆదర్శంగా నిలిచింది. అయితే ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు కోసం చేపట్టిన కార్యక్రమాలు ఈసారి ఆ స్థాయిలో జరగలేదని ప్రజలు భావిస్తున్నారు. అంతేకాకుండా జీవీఎంసీకి ప్రస్తుతం కమిషనర్ కూడా లేకపోవడం పరిస్థితిని మరింత దిగజార్చేలా ఉంది. ఈ నేపథ్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్- 2024 లో విశాఖ ఏ స్థానాన్ని దక్కించుకుంటుందో వేచి చూడాల్సిందే.

**పర్యవేక్షించే నాథుడేడి?**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీవీఎంసీ పాలన పూర్తిగా గాడి తప్పింది. రెండున్నర నెలలుగా జీవీఎంసీకి కమిషనర్ లేకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. పారిశుధ్య పనులు అటకెక్కాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే జరుగుతున్న సమయంలోనే నగరంలో చెత్త పేరుకుపోతోంది. టైర్లు లేకపోవడంతో చెత్త తరలించే టిప్పర్లు, పొక్లెయిన్లు మూలకు చేరాయి. జీవీఎంసీలోని అన్ని జోన్లలో 30కి పైగా పొక్లెయిన్లు నిరుపయోగంగా ఉన్నాయి. పారిశుధ్య కార్మికులకు కనీస పనిముట్లు కూడా అందుబాటులో లేవు. ఈ దుస్థితిపై జీవీఎంసీ శానిటేషన్ అధికారులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఓ కార్యక్రమాన్ని ప్రకటించారు. ఇందులో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర దేగా ప్రకటించారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రించినట్లు కలెక్టర్ చెప్పారు. అయితే క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్ నిషేధం అమలు కావడం లేదు. వీధుల్లో ఎక్కడికక్కడే చెత్త దర్శనమిస్తోంది.

**అవిశ్వాసంపై పెట్టిన శ్రద్ధ.. పాలనపై లేదెందుకు?**

**గతమెంతో ఘనం**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విశాఖపట్నం గణనీయమైన అభివృద్ధి సాధించింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో నగరంలో కోట్లాది రూపాయల విలువైన అభివృద్ధి పనులు జరిగాయి. కొత్తగా రోడ్లు, రోడ్ల విస్తరణ పనులు చేపట్టారు, జంక్షన్లను ఆధునికీరించారు. బస్ షెల్టర్లను కొత్తగా తీర్చిదిద్దారు. మురుగునీటి కాలువలు నిర్మించారు. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడానికి వైఎస్సార్ క్లినిక్‌లు ప్రారంభించారు. నగరంలో కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి యూసీసీటీఆర్ఎఫ్ ప్రాజెక్టుల ద్వారా స్వీపింగ్ మిషన్లను ఉపయోగించారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి ఎకో వైజాగ్ పేరుతో ఎకో క్లీన్, ఎకో గ్రీన్, ఎకో బ్లూ, ఎకో జీరో ప్లాస్టిక్, ఎకో జీరో పొల్యూషన్ వంటి కార్యక్రమాలు చేపట్టారు. అయితే ప్రస్తుతం కమిషనర్ లేకపోవడంతో ఈ పనులన్నీ ఆగిపోయాయి. జీవీఎంసీ పాలన పూర్తిగా గాడి తప్పిందని వామపక్ష నేతలు గత నెల 10న జీవీఎంసీ ఎదుట నిరసన తెలిపారు. కనీస సౌకర్యాలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.

వ్యర్థాల నిర్వహణకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) సెంటర్లు ప్రస్తుతం మూలన పడ్డాయి. జగదాంబ జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన వుమెన్స్ రెస్టో కేఫ్ నిరూపయోగంగా మారింది. నిధులు లేకపోవడంతో అభివృద్ధి, పారిశుధ్య పనులు ఆగిపోయాయి. ప్రధాన రహదారుల్లో కొంతమేర పారిశుధ్యం మెరుగ్గా ఉన్నా, గల్లీలు, వీధు ల్లో పరిస్థితి అధ్వానంగా ఉంది. దోమల నివారణ కు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు




అనారోగ్యం పాలవుతున్నారు. ప్రజలను భాగస్వాములను చేయాల్సిన స్వచ్ఛత కార్యక్రమాల్లో సచివాలయం సిబ్బందిపై ఒత్తిడి తీసుకొచ్చి.. ప్రభుత్వం అభాసుపాలైంది. ఆ మధ్య ఓటీపీలు సేకరించలేదని సచివాలయ కార్యదర్శులకు జోనల్ కమిషనర్ నోటీసులు జారీ చేయడంపై విమర్శలు వచ్చాయి. మేయర్‌పై అవిశ్వాసంపై పెట్టిన శ్రద్ధను కూటమి నేతలు కమిషనర్‌ను నియమించడంపై ఎందుకు చూపడం లేదనే ప్రశ్న ఇప్పుడు అందరి మదిలోనూ మెదులుతోంది. రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌కు కమిషనర్‌ను నియమించలేని అసమర్థత కూటమి ప్రభుత్వానిదేనని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విశాఖ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏ ర్యాంక్ సాధిస్తుందో చూడాలి.

**దటీజ్ వైఎస్ జగన్**

చంద్రబాబు ప్రభుత్వ హయాం(2018-2019)లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ నగరం 23వ ర్యాంక్‌కే పరిమితమైంది. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి తర్వాత 2020లో 9వ ర్యాంకు, 2022లో 4వ ర్యాంకు సాధించిన నగరం 2023 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మరోసారి 4వ ర్యాంకు సాధించి సగర్వంగా నిలిచింది. విజయవాడ, తిరుపతి కూడా జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించాయంటే ఆ ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుంది.

# క్రీడా సమాచారమ్

## అనికేత్ వర్మకు హార్దిక్ 'మ్యాగీ' స్టోరీనే స్ఫూర్తి



**ఇంటర్నెట్ డెస్క్:** యువ బ్యాటర్ అనికేత్ వర్మ దూకుడు సన్‌రైజర్స్ అభిమానులను ఆకట్టుకుంది. టాప్ బ్యాటర్లు విఫలమైనప్పటికీ.. అనికేత్ మాత్రం కీలక ఇన్నింగ్స్‌తో రాణించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ ఆటగాడు అనికేత్ వర్మ సూపర్ ఇన్నింగ్స్ ఆడాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో 41 బంతుల్లోనే 74 పరుగులు చేశాడు. ఎస్ఆర్‌హెచ్ ఓడినా.. అనికేత్ ఆట మాత్రం ఆకట్టుకుంది. అయితే, 23 ఏళ్ల అనికేత్‌కు హార్దిక్ పాండ్య ఇన్‌స్పైర్‌గా నిలిచాడని ఈ యువ ప్లేయర్ అంకుల్ అమిత్ వర్మ వెల్లడించాడు. దాదాపు నాలుగేళ్లపాటు మ్యాగీ న్యూడిల్స్ తినే క్రికెట్ ప్రాక్టీస్‌కు వెళ్లినట్లు పలు ఇంటర్వ్యూల్లో హార్దిక్ తెలిపిన సంగతి తెలిసిందే. వాటిని విన్న అనికేత్ కెరీర్‌ను సీరియస్‌గా తీసుకొని సన్నద్ధమైనట్లు అమిత్ వ్యాఖ్యానించాడు.

"అప్పుడు అనికేత్‌కు 14ఏళ్లు. ఓసారి న్యూస్‌పేపర్‌లో ఓ వార్త చదివా. అదే స్టోరీని అకాడమీకి వెళ్తూ అనికేత్‌కు చెప్పా. అదేరోజు నేను అనికేత్‌లో ఆటపట్ల ప్యాషన్, పరుగుల దాహం చూశా. కీలక ఆటగాడిగా మారతాడని అప్పుడే భావించా. ఒకసారి స్టేడియం చేరుకున్నాక.. నా పాదాలను తాకిన అనికేత్ 'కొన్ని విషయాలను మీ దృష్టికి తీసుకొస్తున్నా' అని చెప్పాడు. అప్పుడు నేను నవ్వా. కానీ, అతడు మాత్రం సీరియస్‌గా తీసుకున్నాడు. హార్దిక్ పాండ్య ఐపీఎల్‌లోకి డెబ్యూ చేసిన తర్వాత జాతీయ జట్టులోకి వచ్చాడు. అలాగే ఏదొక రోజు అనికేత్ కూడా ఆ స్థాయికి చేరతాడనుకుంటున్నా" అని అమిత్ వెల్లడించారు.

**అనికేత్ బ్యాటింగ్ అదుర్స్: పుజారా**

"అనికేత్ బ్యాటింగ్ అద్భుతంగా ఉంది. అతడిపై ఎలాంటి ఒత్తిడి ఉన్నట్లు కనిపించలేదు. తనదైన షాట్లను ఆడేందుకు ప్రయత్నించి సఫలమయ్యాడు. బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించిన తీరు అభినందనీయం" అని భారత వెటరన్ క్రికెటర్ ఛెతేశ్వర్ పుజారా వ్యాఖ్యానించాడు. ఢిల్లీ పేసర్ మిచెల్ స్టార్క్ దెబ్బకు 37/4తో కష్టాల్లో పడిన సన్‌రైజర్స్ ను తన ఇన్నింగ్స్‌తో అనికేత్ ఆదుకొనేందుకు ప్రయత్నించాడు. ఢిల్లీకి (164 పరుగులు) మెరుగైన లక్ష్యం అందించడంలో కీలక పాత్ర పోషించాడు.

## మాకు హెూం గ్రౌండ్ కానీ.. పంజాబ్ క్యూరేటర్ ఉన్నట్లుంది

### - జహీర్ ఖాన్



**ఇంటర్నెట్ డెస్క్:** లఖ్‌నవూలోని ఏకనా మైదానం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఎల్ఎస్‌జీకి ఓటమి ఎదురైంది. పంజాబ్ కింగ్స్ మరో 22 బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించడం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టును నిరాశపరిచింది. గాయాలతో పేస్ విభాగం కాస్త బలహీనంగా ఉన్నప్పుడు స్పిన్‌కు అనుకూలంగా పిచ్‌ను తయారుచేసి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం లఖ్‌నవూ మెంటార్ జహీర్ ఖాన్ వెల్లడించాడు. తమకు హెూం గ్రౌండ్ అయినప్పటికీ పంజాబ్ క్యూరేటర్ ఇక్కడ ఉన్నట్లు అనిపించిందని వ్యాఖ్యానించాడు.

" ఈ ఫలితం మాకు తీవ్ర నిరాశ మిగిల్చింది. మా సొంత మైదానంలో మ్యాచ్. ఇతర టీమ్‌లు తమ హెూంగ్రౌండ్‌లో పిచ్‌ను అనుకూలంగా ఉండేటట్లు చూసుకుంటాయి. ఆ కోణంలో లఖ్‌నవూ పిచ్ క్యూరేటర్ ఆలోచించినట్లు అనిపించలేదు. పంజాబ్ క్యూరేటర్ రూపొందించినట్లు ఉంది. ఇలాంటి అంశాలను గుర్తించి పరిష్కరించుకుంటాం. నాకు ఈ సెటప్ కాస్త కొత్తే. అందుకే, ఇదే మొదటి, అలాగే చివరి మ్యాచ్ అవుతుందని భావిస్తున్నా. ఇంకెప్పుడూ పిచ్ విషయంలో పొరపాట్లు జరగవని ఆశిస్తున్నా. లఖ్‌నవూ అభిమానులను నిరుత్సాహానికి గురి చేయడం సరైంది కాదు. మామీద ఎన్నో అంచనాలు పెట్టుకొని ఇక్కడికి వస్తారు. తొలి మ్యాచ్‌లోనే ఓడిపోవడం వల్ల నిరాశపడ్డారు" అని జహీర్ తెలిపాడు.

**పాఠాలు నేర్చుకుంటాం..**

"జట్టుపరంగా మాకెలాంటి సమస్యలు లేవు. ఆత్మవిశ్వాసంతో ఉన్నాం. ఈ ఓటమిని మేం అంగీకరిస్తున్నాం. పాఠాలు నేర్చుకొని ముందుకుసాగుతాం. హెూం గ్రౌండ్స్‌లో జరిగే మ్యాచ్ కావడంతో ఆ ప్రభావం ఉంటుంది. దాన్నుంచి బయటపడి తదుపరి మ్యాచ్‌ల కోసం సన్నద్ధమవుతాం. ఇక్కడ ఇంకా ఆరు మ్యాచ్‌లు ఆడతాం. ఐపీఎల్‌లో పాజిటివ్ మైండ్‌సెట్‌తో ఉండాలి. పోరాడటంతో పాటు పరుగులు చేయాలనే ఆకలి ఉన్న క్రికెటర్లను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ప్రతిఒక్కరి భాగస్వామ్యం కీలకం. తప్పకుండా రాబోయే మ్యాచుల్లో విజేతగా నిలుస్తాం" అని లఖ్‌నవూ మెంటార్ స్పష్టం చేశాడు.

## '2024' సీన్ రీక్రియేషన్..

### పంత్‌తో గోయెంకా సంభాషణ వైరల్



**ఇంటర్నెట్ డెస్క్:** మ్యాచ్‌లో గెలిస్తే ఫర్వాలేదు.. ఓడితే మాత్రం వెంటనే ఆయన బయటకొచ్చేస్తారు. కెప్టెన్‌ను అందరి ముందూ మందలించినట్లు మాట్లాడతారు. గత సీజన్ అలవాటును ఇప్పుడూ కొనసాగిస్తున్నారా? అనే అనుమానం రాకమానదు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు షాక్ ఇచ్చిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కు సొంత మైదానంలో మాత్రం ఓటమి తప్పలేదు. పంజాబ్ కింగ్స్ అన్ని విభాగాల్లో ఆధిపత్యం ప్రదర్శించింది. అయితే, మ్యాచ్ అనంతరం లఖ్‌నవూ ఓనర్ సంజీవ్ గోయెంకా - కెప్టెన్ రిషభ్ పంత్ ల మధ్య సంభాషణ మళ్లీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరోసారి 'కేఎల్ రాహుల్ - గోయెంకా' ఎపిసోడ్ రీక్రియేట్ అయినట్లు అనిపిస్తోందని కామెంట్లు వస్తున్నాయి.


డ్రెస్సింగ్ రూమ్‌లోనూ పంత్‌తో గోయెంకా చర్చించే వీడియోలు బయటకొచ్చాయి. ప్రతి మ్యాచ్ ఫలితంపై కెప్టెన్‌తో మాట్లాడాల్సిన అవసరం లేదని.. అందుకోసం కోచ్‌లు ఉన్నారని పలువురు కామెంట్లు చేస్తున్నారు. గతంలో కేఎల్ రాహుల్ విషయంలోనూ గోయెంకా ఇలాగే వ్యవహరించారని మరోసారి గుర్తు చేశారు. కెప్టెన్‌కు స్వేచ్ఛ ఇస్తేనే ఫలితాలు సానుకూలంగా ఉంటాయనేది వారి వాదన. ఇతర ఫ్రాంచైజీల ఓనర్లు ఎవరూ ఇలా ప్రవర్తించడం లేదంటూ వ్యాఖ్యలు చేశారు.

**మేం 25 పరుగులు తక్కువ చేశాం: పంత్**

"పంజాబ్‌కు మేం నిర్దేశించిన లక్ష్యం సరిపోలేదు. కనీసం 25 పరుగులు అదనంగా చేయాల్సింది. ఇవన్నీ ఆటలో సహజమే. మా సొంత మైదానంలో పిచ్ కండీషన్లను సరిగ్గా అంచనా వేయాల్సి ఉంది. త్వరగా వికెట్లను కోల్పోతే భారీగా పరుగులు చేయడం కష్టమే. ప్రతిఒక్కరూ జట్టు కోసం కష్టపడుతున్నారు. పిచ్ మందకొడిగా ఉన్నప్పుడు స్లో బంతులను సంధిస్తే ఫలితం అనుకూలంగా వస్తుంది. ఈ మ్యాచ్ నుంచి పాఠాలు నేర్చుకొని ముందుకుసాగుతాం. కొన్ని సానుకూల అంశాలూ ఉన్నాయి. ఇంతకుమించి ఏమీ చెప్పలేను" అని వెల్లడించాడు.

## హాకీకి వందన వీడ్కోలు

**ఢిల్లీ:** భారత మహిళల హాకీ వెటరన్ ప్లేయర్ వందన కటారియా ఆటకు వీడ్కోలు పలికింది. 15 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఈ స్ట్రైకర్.. 320 మ్యాచ్‌లు ఆడి 158 గోల్స్ కొట్టింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో త్రుటిలో కాంస్య పతకం చేజార్చుకున్న భారత జట్టులో 32 ఏళ్ల వందన కూడా సభ్యురాలు. "భారమైన హృదయంతో ఆటకు వీడ్కోలు పలుకుతున్నా. ఫామ్‌లో ఉండగానే ఆటకు దూరం కావాలని అనుకున్నా. ఎంతో కష్టపడి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగా. భారత జెర్సీ ధరించడం ఎంతో గర్వకారణం. సుదీర్ఘ కాలం దేశానికి ఆడా. ముఖ్యంగా టోక్యో ఒలింపిక్స్‌ను ఎప్పటికీ మరిచిపోలేను. దక్షిణాఫ్రికాపై హ్యాట్రిక్ చేయడం మధుర స్మృతి. కానీ ఒలింపిక్ పతకం సాధించకపోవడం పెద్ద వెలితి. అంతర్జాతీయ హాకీకి వీడ్కోలు పలికినా హాకీ ఇండియా లీగ్‌లో ఆడతా" అని వందన తెలిపింది. హరిద్వార్‌కు చెందిన వందన 2009లో అరంగేట్రం చేసి.. తక్కువ కాలంలోనే జట్టులో కీలక సభ్యురాలిగా ఎదిగింది. టోక్యో ఒలింపిక్స్‌లో హ్యాట్రిక్ చేసిన ఆమె.. ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా ప్లేయర్‌గా నిలిచింది.




"ఎటాకింగ్‌లో వందనదే కీలకపాత్ర. ఆమె ముందుండి జట్టును నడిపించేది. గోల్స్ కొట్టి అందరికి స్ఫూర్తినిచ్చేది. భవిష్యత్ తరాలకు ప్రమాణాలు నెలకొల్పింది" అని హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ అన్నాడు. 2016, 2023 ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ విజయాల్లో ప్రధానపాత్ర పోషించిన వందన.. 2022 నేషన్స్ కప్ గెలుపులోనూ కీలకమైంది. హాకీలో వందన సేవలకు గుర్తింపుగా పద్మశ్రీ (2022), అర్జున (2021) పురస్కారాలు దక్కాయి.

### ఎన్ఎల్‌సీఐఎల్ సీఎండీ ప్రసన్నకుమార్‌కు

## సీఎండీ ఆఫ్ ది ఇయర్ అవార్డు



**భువనేశ్వర్, (విశాఖ సమాచారమ్):-** తెలుగుజాతి గర్వించదగిన అత్యుత్తమ అధికారిగా అనేక అవార్డులు కైవసం చేసుకున్న మోటుపల్లి ప్రసన్నకుమార్‌కు ఒరిస్సా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఎండీ ఆఫ్ ది ఇయర్ అవార్డు లభించింది. ఒడిస్సాలో ప్రఖ్యాతిగాంచిన ది ఇంటర్వ్యూ టైమ్స్ పత్రిక ఆధ్వర్యంలో జరిగిన ఉత్కర్ష్ ఒడిస్సా బిజినెస్ లీడర్‌షిప్ అవార్డుల కార్యక్రమంలో మంగళవారం నాడు జైపూర్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ రవినారాయణ్ బెహరా ప్రసన్నకుమార్‌కు అవార్డు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పద్మవిభూషణ్ సుదర్శన్ సాహు, భువనేశ్వర్ నగర మేయర్ సులోచనా దాస్, ఇతర అతిథులు ప్రసన్నకుమార్ సేవలను కొనియాడారు. ఒడిస్సా రాష్ట్రంలో విద్యుత్ ఉత్పాదన గణనీయంగా పెంచేందుకు ఎన్ఎల్‌సీఐఎల్ ఛైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రసన్నకుమార్ విశేషంగా సహకారం అందించారని కొనియాడారు.

ఈ సందర్భంగా ఎనర్జీ అండ్ సస్టైనబిలిటీ రౌండ్‌టేబుల్ 2025 సదస్సులో ఒడిస్సా రాష్ట్రంలో గల ప్రకృతి వనరుల యొక్క అత్యధిక లభ్యతను ప్రసన్నకుమార్ సభకు తెలియజేశారు. ఒడిస్సా రాష్ట్రంలోని సంబల్ పూర్, జార్సుగుడ జిల్లాలలో తాలాబిరా రెండూ & మూడు బొగ్గు గనుల అత్యధిక సామర్థ్యాన్ని ఆయన కొనియాడారు. తాలాబిరాలో 2400 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించబోయే థర్మల్ విద్యుత్ కేంద్రానికి 2024 ఫిబ్రవరిలో ప్రధానమంత్రి నరేంద్రమోది శంకుస్థాపన చేసిన విషయాన్ని కూడా ప్రసన్నకుమార్ సభికులకు గుర్తు చేస్తూ ఎన్ఎల్‌సీ ఒడిస్సా రాష్ట్రంలో మాచ్ కాటా మరియు న్యూ పాత్రపారా దక్షిణ బొగ్గుగనులలో టెండరు గెలిచిందని అంగుల్ జిల్లాలో ఈ గనులు ఉన్నాయని అన్నారు. సోలార్ మరియు పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టులకు ఒడిస్సా ప్రభుత్వానికి ఎన్ఎల్‌సీ సంస్థ అవకాశాలు కల్పించబోతున్నట్లు దీర్ఘకాలిక పర్యావరణ రక్షిత ప్రాజెక్ట్‌లు ప్రారంభించబోతున్నట్లు వికసిత్ భారత్ పథకం క్రింద అధిక విద్యుత్ ఉత్పాదన సాధించబోతున్నట్లు ప్రసన్నకుమార్ తెలియజేశారు. గడచిన పదేళ్లుగా ది ఇంటర్వ్యూ టైమ్స్ పత్రిక ఒడిస్సాలో అందిస్తున్న జర్నలిజం సేవలను ఆయన కొనియాడారు. ఇంత ప్రతిష్టాత్మకమైన అవార్డును పొందే విషయంలో ఎన్ఎల్‌సీ సంస్థ ఉద్యోగులు, అధికారులు తనకు అందించిన సహాయ సహకారాలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.



## మహిళలకు రక్షణగా శక్తి టీమ్స్ ఏర్పాటు

### అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో) :-** జిల్లాలో మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు, మహిళలకు రక్షణ గా నిలిచే చట్టాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'శక్తి' యాప్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యేకంగా శక్తి టీమ్స్ ను నియమించినట్టు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శక్తి టీమ్స్ నిర్వర్తించే విధులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై బుధవారం ఆయన దిశా నిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల పట్ల ఎటువంటి దాడులు, అఘాయిత్యాలు, వేధింపులు లేకుండా చేసేందుకుగాను ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో 'శక్తి టీమ్స్' ను జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, ముఖ్య కూడళ్ళను (హాట్ స్పాట్స్ ను) మఫ్టీలో సందర్శించి, మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు చేపడతరన్నారు. దీనిలో భాగంగా అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, పరవాడ, నర్సీపట్నం పట్టణాలలో ఆరుగురు పోలీసు సిబ్బందితో ఐదు బృందాలుగా మొత్తం 30 మందితో శక్తి టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఒక్కొక్క బృందానికి ఎస్సై నాయకత్వం వహిస్తారన్నారని చెప్పారు. ఈ బృందాలు మఫ్టీలో విధులు నిర్వహిస్తారని జిల్లా ఎస్పీ తెలిపారు.

ఆపద సమయంలో శక్తి యాప్‌కు వచ్చే ఎస్.ఓ.ఎస్.కాల్స్, డయల్ 112/100 కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యలను చట్టబద్దంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా శక్తి టీమ్స్ ను ఆదేశించారు. మహిళలకు రక్షణగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించి, వారి మొబైల్స్ లో యాప్ నిక్షిప్తం చేయడం, రిజిస్ట్రేషను చేయాలన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ ఏవిధంగా పని చేస్తుందన్న విషయాన్ని విద్యార్థినులు, మహిళలకు వివరించాలన్నారు. ఈ బృందాల పని తీరును జిల్లాలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ పర్యవేక్షిస్తారని, మహిళా పీఎస్ డీఎస్పీ ఈ.శ్రీనివాసులు నోడల్ అధికారిగా ఉంటారన్నారు. అంతేకాకుండా, శక్తి టీమ్స్‌ను రాష్ట్ర డీజీపీ కార్యాలయం కూడా పర్యవేక్షిస్తుందని, వారి ఆదేశాల మేరకు పనిచేయాల్సి ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, మహిళా పి.ఎస్ డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, సి.ఐ చంద్రశేఖర్, ఎస్సై మనోజ్ కుమార్, శక్తి టీమ్స్ సభ్యులు పాల్గొన్నారు.

## సినీ ఆర్టిస్టుల కోసం, మోక్ష రెస్టారెంట్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ప్రతిష్టాత్మకమైన చిత్రాలకు దర్శకత్వం వహించిన, డైరెక్టర్ రాకేష్ రెడ్డి సినీ ఆర్టిస్టులకు కోసం మోక్ష రెస్టారెంట్‌ను ఇటీవల ప్రారంభించారు. సినిమా దర్శకులు మరియు సినిమా కళాకారులకు. తన రెస్టారెంట్ వేదికగా. గెట్ టుగెదర్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి, విశాఖ నగరంతో పాటు పరిసర ప్రాంత, సినీ కళాకారులు మరియు. సినిమా దర్శకులు. సాంకేతిక నిపుణులు, సినీ సంగీత నేపథ్య గాయకులు, మ్యూజిక్ డైరెక్టర్స్, సినిమా కెమెరా విభాగపతులు. డిస్ట్రిబ్యూటర్స్ అండ్ ఎగ్జిబిటర్స్. తదితరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ముందుగా, దర్శకులు రాకేష్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ చెన్నై, విధానంలో, వైజాగ్ లో కూడా, కళాకారులకి, డైరెక్టర్స్ కి, మిగతా సాంకేతిక విభాగాలకు, ఒక అడ్డా కావాలని, కోరికతో, ఈ రెస్టారెంట్ ని ఏర్పాటు చేశానని, స్టోరీ డిస్కషన్ చేయాలన్న, ప్రెస్ మీట్ లు పెట్టుకోవాలన్నా, సినిమా ఆడిషన్స్ జరుపుకోవాలన్న, తమ వేదిక ఉచితంగా అందిస్తున్నామని, సభాముఖంగా తెలియజేశారు, ముఖ్య అతిథిగా విచ్చేసిన, దర్శకులు యాద్ కుమార్ మాట్లాడుతూ, రీ రికార్డింగ్ స్టూడియో డబ్బింగ్ థియేటర్, వంటివి నగర ప్రజలకు అందించిన రాకేష్ రెడ్డి మరో అడుగు ముందు వేసారని కొనియాడారు. హీరోయిన్ రేఖ భోజ్, మాట్లాడుతూ ఈరోజు నాకు చాలా ఆనందంగా ఉందని అన్నారు, దర్శకులు రమేష్ పొత్తిన మాట్లాడుతూ, వైజాగ్ లో సినిమా నిర్మించాలన్న తపనతో ఉన్న ప్రతి ఒక్కరూ కూడా రుసుము చెల్లించకుండా, ఈ వేదికని వినియోగించుకోవాలని తద్వారా కళాకారులకు మంచి మంచి అవకాశాలు రాగలవని అభిప్రాయపడ్డారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, For advertisements (Raghunath) : 7013785256, Arilova (D.Venkatesh) : 94937 77390.
Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Anakapalli (M.Krishna Rao) : 63023 75539, Chintapalli (Srinivas) : 94923 40861.
Bheemunipatnam (B.Appalareddy) : 98662 78981, Srikakulam (Ramarao) : 70321 98574, Pithaapuram (staalin) : 94912 23264,

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.